ప్లీజ్ గౌరవించండి!



డీఆర్సీ మీటింగులో ప్రజాప్రతినిధుల ఆవేదన వెనుక కారణాలేంటి?

చిత్తూరు, ఆంధ్రజ్యోతి

వైసీపీ హయాంలో జిల్లా అధికారులంతా అప్పటి ప్రజాప్రతినిధుల ఎదుట కుర్చీ చివర్లో వినయంగా కూర్చుని.. చెప్పిన పనంతా చేసేవారు. అప్పట్లో ఎమ్మెల్యేలకు నచ్చని తహసీల్దార్, ఎంపీడీవో, సీఐ, ఎస్‌ఐలను రాత్రికిరాత్రే బదిలీ చేసేవారు. ఎమ్మెల్యేలను జిల్లా ఉన్నతాధికారులు కూడా ఆఫీసు బయటకు వచ్చి కారు ఎక్కించి వీడ్కోలు చెప్పే వారు. కూటమి ప్రభుత్వంలో ఈ తీరు మారింది. అధికారులను గౌరవించాలనీ, వారిపని వారు చేసుకునేలా ఉండాలనీ చంద్రబాబు పదేపదే నాయకులను హెచ్చరిస్తుండడంతో అన్ని స్థాయిల్లో అధికారులకూ స్వేచ్ఛ లభించింది. అయితే దీన్ని అలుసుగా తీసుకుని కొందరు అధికారులు తమను కనీసం లెక్కచేయడం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. ఏకంగా ఆదివారం జరిగిన డీఆర్సీ మీటింగులోనే భగ్గుమన్నారు. 'నిబంధనలు అతిక్రమించాల్సిన అవసరం లేదు. కనీసం స్పందించండి. గౌరవం ఇవ్వండి' అంటూ అధికార పార్టీ ప్రజాప్రతినిధులు అడుక్కోవాల్సి వచ్చింది.

సమగ్రశిక్ష పీడీ తీరుతో..

జిల్లా సమగ్ర శిక్ష పీడీ వెంకటరమణారెడ్డి తీరు పట్ల ప్రజాప్రతినిధులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సహకార శాఖకు చెందిన ఈయన 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి మంత్రి పెద్దిరెడ్డి సిఫార్సుతో ఇక్కడికి పీడీగా వచ్చారు. ఇటీవల కుప్పంలోని అగస్త్య కేంద్రంలో జిల్లాలోని 450మంది టీచర్లకు మూడు విడతల్లో 18 రోజుల పాటు శిక్షణా తరగతుల్ని నిర్వహించారు. విద్యాశాఖ కమిషనర్ విజయరామరాజు కూడా ఓసారి వచ్చి తనిఖీ చేసి వెళ్లారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిక్షణా తరగతుల గురించి స్థానిక ఎమ్మెల్సీ, మండలి విప్ శ్రీకాంత్‌కు కనీస సమాచారం లేదు. దీన్ని ఆయన తీవ్ర అవమానంగా భావించారు.

నిబంధనలకు విరుద్ధంగా... సెక్టోరియల్ అధికారులుగా

వైసీపీ హయాంలో ఓ సామాజికవర్గానికి చెందిన టీచర్లను నిబంధనలకు విరుద్ధంగా సెక్టోరియల్ అధికారులుగా నియమించారు. వారంతా గత ఎన్నికల్లో బహిరంగంగానే వైసీపీ గెలుపు కోసం పనిచేశారు. ఇప్పుడు వారి స్థానంలో వేరేవాళ్లను నియమించాలని ఒకరిద్దరు టీచర్లకు జిల్లాలోని ఎమ్మెల్సీ సహా ఎమ్మెల్యేలంతా సిఫార్సు లెటర్లను ఇచ్చారు.అయితే పీడీ కనీసం స్పందించలేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. పైగా ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల లెటర్లతో వెళ్లినవారిని కనీసం రెండు మూడు గంటలు వెయిట్ చేయించుకోవడం పరిపాటిగా మారిందని వీరు అంటున్నారు. చిత్తూరు, పూతలపట్టు, జీడీనెల్లూరు ఎమ్మెల్యేలు ఈ విషయమై ఆదివారం నాటి సమావేశంలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

గత డీఈవోతో ఇబ్బందులు

గతంలో డీఈవోగా పనిచేసిన దేవరాజు తమ లెటర్లను పరిగణనలోకి తీసుకోవడం లేదని, లెటర్లను తెచ్చిన వారికి షోకాజ్‌లు కూడా ఇచ్చారని, తమతో కలిసి విద్యాశాఖ కార్యక్రమాల్లో పాల్గొనకుండా అవమానించారంటూ కొందరు ప్రజాప్రతినిధులు ఫిర్యాదు చేశారు. ఆయన్ను బదిలీ చేసిన ప్రభుత్వం, తాజాగా రాష్ట్ర కార్యాలయంలో పోస్టింగ్ ఇచ్చింది.

ఇక చిత్తూరు వన్‌టౌన్ సీఐ జయరామయ్య తీరుపై ఎమ్మెల్యే గురజాల పలుమార్లు బహిరంగంగానే ఆరోపించారు. కొందరు అధికారుల తీరు మారకుంటే సీఎంకు ఫిర్యాదు చేస్తామని, వచ్చే డీఆర్సీ సమావేశానికి గైర్హాజరై నిరసన తెలియజేస్తామనే హెచ్చరికలు కూడా ప్రజాప్రతినిధులు చేయడం విశేషం.

పూతలపట్టు ఎమ్మెల్యే ఆవేదన

అటవీశాఖ అధికారుల తీరుతో సమీప గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ డీఆర్సీ సమావేశంలో ఆవేదన చెందారు. ఐరాలలో ఓ కుటుంబం ఇటీవల పెంపుడు పందిని కోసుకుని వండుకుంది. వారితో వైరం ఉన్న స్థానిక వైసీపీ నేత ఫిర్యాదు మేరకు ఆ కుటుంబం మీద అడవి పందిని కోశారని కేసు నమోదు చేశారు. ఆది అడవి పంది కాదు, పెంపుడు పంది. కావాలంటే ల్యాబ్‌కు తీసుకెళ్లి పరీక్షించమని తాను కోరినా ఫలితం లేకుండా పోయిందన్నది ఎమ్మెల్యే ఆవేదన.

టమోటా కిలో రూ.17.40

ధరలు తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన



పుంగనూరు/సోమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పుంగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో సోమవారం టమోటా ధరలు గణనీయంగా తగ్గిపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తోడు తెగుళ్ల వల్ల పంట దెబ్బతినడంతో మార్కెట్‌లో ధరలు పడిపోయాయి.ఈనెల 2వ తేది మార్కెట్‌లో నాణ్యతగల మొదటిరకం కిలో టమోటా ధర రూ.66.70 ఉండగా సోమవారం కిలో రూ.17.40కి పడిపోయింది.యార్డుకు సోమవారం 50.91 మెట్రిక్ టన్నుల టమోటాలు రాగా మొదటి రకం రూ.17.40, రెండోరకం రూ.15.40. మూడోరకం రూ.13.40 ధర పలికింది. కాగా మొదటిరకం టమోటా 2వ తేది కిలో రూ.66.70 పలకగా, 6వతేది కిలో రూ.56.70, 7వ తేది రూ.40, 8వతేది రూ.23.40 పలకగా సోమవారం ఏకంగా రూ.17.40కి పడిపోయింది.వారం క్రితం రూ.1000 వరకు పలికిన 15 కిలోల బాక్సు సోమవారం మార్కెట్‌లో రూ.100 నుంచి రూ.260 పలికిందని సోమల రైతులు తెలిపారు. ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు వ్యయం చేస్తుండగా ధరలు తగ్గుముఖం పడడంతో తమ పరిస్థితి అగమ్య గోచరంగా మారిందని వాపోతున్నారు. సెప్టెంబరు,అక్టోబరు నెలల్లో నాటిన ప్రస్తుత పంటకు వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదని, దీంతో అధిక ఖర్చు చేసి మందులు పిచికారీ చేయాల్సివచ్చిందన్నారు.ఇప్పుడేమో పంట ఎదురుగా కనిపిస్తున్నా చేతికి సొమ్ము రాని పరిస్థితి ఏర్పడిందంటున్నారు.

బొమ్మసముద్రం పంచాయతీకి రేపు ఢిల్లీలో అవార్డు ప్రదానం

రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న సర్పంచ్, అధికారులు

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఐరాల మండలంలోని బొమ్మసముద్రం ఎంపికైన విషయం తెలిసిందే. ఆరోగ్య విభాగంలో ఎంపికవడంతో ఈ పంచాయతీకి రూ.కోటి పురస్కారం లభించనుంది. బుధవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగే కార్యక్రమంలో దీనికి సంబంధించిన అవార్డును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా బొమ్మసముద్రం సర్పంచ్ రఘునాథ్, అధికారులు అందుకోనున్నారు. అలాగే రూ.కోటి పురస్కార మొత్తాన్ని కూడా రాష్ట్రపతి బటన్ నొక్కి.. పంచాయతీ బ్యాంకు ఖాతాకు బదిలీ చేస్తారు. కాగా, ఇందులో పాల్గొనాల్సిన కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈనెల 11, 12 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కలెక్టర్ల సదస్సుకు హాజరు కావాల్సి ఉంది. అందువల్ల జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీపీవో సుధాకర్‌రావు, ఐరాల ఎంపీడీవో ధనలక్ష్మితోపాటు ఆ గ్రామ పంచాయతీ కార్యదర్శి, ఈవోపీఆర్డీలు మంగళవారం చిత్తూరు నుంచి ఢిల్లీకి బయల్దేరనున్నారు.

మామిడి పంట బీమా నమోదు సమయం తక్కువే

చిత్తూరు సెంట్రల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా విభజన తర్వాత చిత్తూరులో మామిడి ప్రధాన పంటగా మారింది. జిల్లాలో 70వేల మంది రైతులు 1,35,867 ఎకరాల్లో 45 రకాల మామిడిని సాగు చేస్తున్నారు. ఏడాదికి 6 లక్షల టన్నుల దిగుబడి వస్తోంది. 4.5 లక్షల టన్నులు జిల్లాలో 30 గుజ్జు పరిశ్రమలకు వెళుతుండగా, మిగిలిన టేబుల్ వెరైటీ మామిడి ఇతర రాష్ట్రాలతోపాటు విదేశాలకు ఎగుమతి అవుతుంది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన చిత్తూరు మామిడి బీమా చేసుకునే గడువు సమయం తక్కువగా ఇవ్వడంపై రైతులు అసహనం చేస్తున్నారు. రబీ సీజన్ 2024-25 గాను పునర్వ్యవస్థీకరించబడిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ ద్వారా మామిడి పంట బీమా చేసుకోవాలని ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఎకరాకు రూ.35వేల బీమా పరిహారం ఇవ్వనుండగా, రైతు వాటా కింద ప్రీమియం రూ.1750 చెల్లించాల్సి ఉంది. మామిడి పంట బీమా నమోదు ప్రక్రియ జిల్లాలో ఈనెల 7న మొదలై 15వ తేదీతో గడువు ముగియనుండటంపై రైతులు ఆవేదన చెందుతున్నారు. గడువు తర్వాత నెలాఖరు వరకు ఉద్యాన శాఖ అధికారులు బీమా చేసుకున్న రైతుల సాగులో పంట నష్టాలను అంచనా వేయనున్నారు. బీమా నమోదు గడువు నెలాఖరు వరకు పెంచాలని జిల్లా రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. వారాంతానికి ఎంత మంది రైతులు మామిడి పంట బీమా చేసుకున్నారనేది లెక్క తేలనుంది.

ఏనుగు దాడిలో ఇల్లు ధ్వంసం



ధ్వంసమైన ఇల్లు

గంగవరం,డిసెంబరు 9, (ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి ఒంటరి ఏనుగు ఓ ఇంటిపై దాడికి పాల్పడింది. ఇంట్లోవారిని భయకంపితులను చేసింది. బాధితుడి కథనం మేరకు... బండమీద జరావారిపల్లెకు చెందిన రెడ్డెప్ప గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలం వద్ద ఇల్లు కట్టుకుని కుటుంబ సభ్యులతో ఉంటున్నాడు. ఆదివారం అర్ధరాత్రి ఏనుగు అతరి ఇంటికి వచ్చింది. తొండంతో గోడను కూల్చి లోపలికి ప్రవేశించేందుకు ప్రయత్నించింది. ఏనుగును చూసి భయభ్రాంతులైన రెడ్డెప్ప కుటుంబ సభ్యులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని పరుగులు తీశారు. అయినా ఏనుగు వెంటాడడంతో పొలాల్లో దాక్కున్నారు. ఒంటరి ఏనుగు పట్టువదలకుండా ఇంటి గోడలు కూల్చివేసింది. నిల్వ ఉంచిన రెండు బస్తాల రాగులు, రెండు బస్తాల బియ్యం తినేసింది. సామగ్రిని ధ్వంసం చేసేసింది. ఈ సంఘటనపై బాధితుడు సోమవారం ఉదయం అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశాడు. అధికారులు చేరుకొని ఇంటిని పరిశీలించారు. పరిహారం అందేలా సహకరిస్తామని భరోసా ఇచ్చారు.



ముత్తుకూరులో సర్వే నిర్వహిస్తున్న సిబ్బంది

అర్హులా..? అనర్హులా...?


ముత్తుకూరు సచివాలయ పరిధిలో సామాజిక పెన్షనర్ల పరిశీలన

చిత్తూరురూరల్,డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో పలువురు అనర్హులకు పింఛన్లు మంజూరు చేశారన్న ఆరోపణలపై కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టింది.. పెన్షనర్ల పరిశీలన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఇందు కోసం జిల్లాకు ఒక సచివాలయాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి పింఛను లబ్ధిదారులపై సర్వే నిర్వహిస్తోంది. చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు సచివాలయాన్ని చిత్తూరు జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. సోమవారం 22మంది అధికారుల బృందం ముత్తుకూరులో ఇంటింటి సర్వే నిర్వహించింది. ఈ సచివాలయ పరిధిలో మొత్తం 434మంది పెన్షనర్లున్నారు. వీరిలో సుమారు 20మంది అందుబాటులో లేకపోవడంతో మంగళవారం అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. సర్వేకి సహకరించని వారిని అనర్హులుగా ధ్రువీకరిస్తారని అధికారులు తెలిపారు. ఇప్పటి వరకు చేసిన సర్వేలో అనర్హులు ఎవరు లేరని తెలిపారు.

రెవిన్యూ సదస్సులకు 91అర్జీలు

చిత్తూరు కలెక్టరేట్: రెవిన్యూ సదస్సులు మూడవ రోజైన సోమవారం ఎనిమిది రెవిన్యూ గ్రామాల్లో జరిగాయి.967 మంది రైతులు పాల్గొన్న ఈ సదస్సులకు 91అర్జీలు వచ్చాయి.వీటిలో ఆర్వోఆర్ కోసం 61, ఎఫ్ లైన్ పిటీషన్లు 18, ఇతర సమస్యలపై 12 అర్జీలందాయి. వీటితో కలిపి ఇంతవరకు అందిన అర్జీల సంఖ్య 1341కి చేరింది.

మణియానంపల్లి దారి సమస్య పరిష్కారం



గ్రామానికి దారికి సర్వే చేస్తున్న అధికారులు

పెనుమూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌కు 70శాతం రెవెన్యూ సమస్యల మీదే ఫిర్యాదులు వస్తున్నాయి. భూమి విలువ రోజురోజుకూ పెరుగుతుండడంతో పల్లెల్లో కూడా మనుషుల మధ్య దారి సమస్యలు, భూ సమస్యలు పెరిగిపోతున్నాయి.ఇటీవల పెనుమూరు మండలంలోని మణియానంపల్లికి దశాబ్దాలుగా వెళుతున్న దారిని మూసేశారంటూ పీజీఆర్ఎస్‌కు ఇరు వర్గాలు వెళ్లారు. ఆ దారి తమకు చెందిన భూమి అంటూ గ్రామానికి చెందిన ఒక వ్యక్తి గత ప్రభుత్వ హయాంలో కూసాలు నాటేశాడు. అప్పటి నుండి గ్రామానికి దారి సమస్య ఉందని అనేక సార్లు అధికారులకు గ్రామస్థులు అర్జీలు పెట్టుకుంటూనే ఉన్నారు.చివరకు సోమవారం కలెక్టర్ ఫోన్ చేసి ఆ దారి సమస్య పరిష్కరించాలని ఆదేశించడంతో అధికారులు వెళ్లారు. తహసీల్దారు ఇరు వర్గాలను పిలిపించి పోలీసుల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఇరు వర్గాలకూ నచ్చజెప్పి దారిని గుర్తించారు.తహసీల్దారు శ్రావణ్‌కుమార్, సెక్రటరీ శ్రీనివాసులు, సర్వేయర్ చిరంజీవి పాల్గొన్నారు.

వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు

పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు



అర్జీదారుల సమస్యలు ఆలకిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత శాఖ అధికారులను హెచ్చరించారు. కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 183 అర్జీలు అందాయి. ఇందులో భూ సమస్యలపైనే 108 వచ్చాయి. జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్రరెడ్డి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వికృతమాల హౌసింగ్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న వికృతమాల హౌసింగ్ కాలనీవాసులు

ఏర్పేడు మండలం వికృతమాల పంచాయతీలోని హౌసింగ్ కాలనీలో కనీస వసతులు కల్పించాలని వికృతమాల ప్రభుత్వ గృహాల అభివృద్ధి కమిటీ నేతలు శివయ్య, గోవర్ధన్, పుష్పరాజ్ కలెక్టర్ వెంకటేశ్వర్‌కు విన్నవించారు. డ్రైనేజీ వ్యవస్థ పాడైపోయిందని, వీధి దీపాలు లేవని, చీకటిపడితే పాములు ఇళ్లలోకి వస్తున్నాయని తెలిపారు. పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేస్తే తమకు సంబంధం లేదని తప్పించుకుంటున్నారని ఆరోపించారు. పరిశీలించి న్యాయం చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

ఏనుగుల నుంచి రైతులను కాపాడండి



జేసీకి వినతిపత్రం ఇస్తున్న రామానాయుడు

ఏనుగుల దాడి నుంచి రైతులను, పంటలను కాపాడాలని ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామానాయుడు కోరారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌కు వినతి పత్రం అందించారు. పది రోజులుగా 17 ఏనుగులు గుంపుగా తిరుగుతూ పంటలను ధ్వంసం చేస్తున్నాయని తెలిపారు. చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం, చంద్రగిరి, పలమనేరు, వి.కోట, గంగవరం మండలాల్లో ఏనుగులు స్వైర విహారం చేస్తున్నా ఫారెస్ట్ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమన్నారు. రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శ్రీనివాసులు, పద్మనాభరెడ్డి, రైతు మల్లికార్జున పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం

● మందుబాబు తీరుతో

రెండు గంటల పాటు విద్యుత్తు అంతరాయం



ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం వేసిన దృశ్యం

శ్రీకాళహస్తి, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): ఫుల్లుగా మద్యం తాగాడు. ట్రాన్స్‌ఫార్మరు వద్ద కరెంటు సరఫరా ఆపేశాడు. ఆపై దానికి తాళం వేసుకుని వెళ్లిపోయాడు. ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో ఇతడి చర్య వల్ల శ్రీకాళహస్తి పట్టణం ఎన్టీఆర్‌నగర్‌లో రెండు గంటల పాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మొదట సాధారణ అంతరాయంగా స్థానికులు భావించారు. అరగంట తరువాత తాగుబోతు పనిగా గుర్తించారు. అతడిని వెదికి పట్టుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్‌కు వేసిన తాళాన్ని తీయమని చెబితే.. అతడు వినలేదు. తనను ప్రశ్నించిన వారిపై బూతుల దండకంతో విరుచుకుపడ్డాడు. దాడికీ యత్నించాడు. ఇలా గంటపాటు వీరంగం చేశాడు. విసిగిపోయిన స్థానికులు డిస్కం అధికారులకు, వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు వచ్చి మందుబాబుకు దేహశుద్ధి చేసి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాళం తీయించారు. మొత్తమ్మీద రెండు గంటలపాటు విద్యుత్తు సరఫరా లేకుండా చేశాడు. దీనిపై డిస్కం అధికారులకు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఎన్టీఆర్ నగర్‌వాసులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆ 600 ఎకరాలు తిరిగి అప్పగించండి!

ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి అధికారుల ఆదేశం

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'శ్రీకాళహస్తి మండలం మన్నవరం వద్ద ఎన్‌బీపీపీఎల్ కంపెనీకి కేటాయించిన భూములలో వినియోగంలో లేని సుమారు 600 ఎకరాలు తిరిగి రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించండి. నూతన పరిశ్రమల స్థాపనకు వాటిని కేటాయించడానికి అవకాశం ఉంటుంది' అని కంపెనీ ప్రతినిధులకు రాష్ట్ర పరిశ్రమలశాఖ కార్యదర్శి యువరాజ్ సూచించారు. ఏపీఐఐసీ ఎండీ అభిషిక్తకిషోర్‌తో కలసి సోమవారం సోమవారం జిల్లా అధికారులతో వర్చువల్‌గా సమీక్షించారు. ఈ సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, సదరు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు. మన్నవరం వద్ద ఎన్టీపీసీ, బీహెచ్ఈఎల్ పవర్ ప్రాజెక్ట్ లిమిటెడ్ (ఎన్‌బీపీపీఎల్) పవర్ ఎక్విప్మెంట్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమకు 2009లో భూములు కేటాయించారు. ఈ భూ అంశం కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ పరిధిలో ఉందని ఆ కంపెనీ ప్రతినిధులు వివరించారు. కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖకు ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపడానికి తగు చర్యలు తీసుకోవాలని ఏపీ ఐఐసీ అధికారులను యువరాజ్ ఆదేశించారు.

అటకెక్కిన శిల్పారామం మాస్టర్‌ప్లాన్



శిల్పారామం ముఖద్వారం - స్టాల్స్, హట్స్

- ● అభివృద్ధి కోసం 2019లో రూ.10 కోట్లు కేటాయించిన టీడీపీ ప్రభుత్వం
- ● కక్షతో నిధులను రద్దు చేసిన జగన్ ప్రభుత్వం
- ● ఆదాయం పెరుగుతున్నా పట్టించుకోని అధికారులు

శిల్పారామం అభివృద్ధికి పదికోట్ల రూపాయలతో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ముందుకు కదలడం లేదు. ఏటా సందర్శకుల సంఖ్య, ఆదాయం పెరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదు. ఉరుకుల పరుగుల జీవనంలో నగరవాసులకు కాసింత సేదతీర్చేందుకు పట్నంలో పల్లె అనుభూతి కలిగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 22 ఏళ్ల క్రితం తిరుచానూరు రోడ్డులో శిల్పారామం (అర్బన్‌హట్)ను ఏర్పాటు చేశాయి. అప్పటి సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి కాశీరామ్ రాణా చేతుల మీదుగా 16 ఎకరాల ప్రాంగణంలో మట్టి బొమ్మల సోయగాలు, పల్లె సొగసులను హత్తుకునేలా అర్బన్ హట్ ప్రారంభమైంది. భారతీయ సంప్రదాయ కళలు నేటి తరానికి అందించడానికి శిల్పారామంలో అనేక కళా, వస్తు ప్రదర్శనలు ఉన్నాయి. ప్రారంభ రోజుల్లో 150 మంది సందర్శకులు మాత్రమే వచ్చేవారు. నేడు ఆ సంఖ్య 900 మందికి చేరింది. శని, ఆదివారాల్లో ఈ సంఖ్య పెరుగుతోంది. తద్వారా ఆదాయమూ పెరుగుతూ వచ్చింది.

మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు ఇవే

శిల్పారామం (అర్బన్‌హట్)లో సందర్శకుల కోసం మరిన్ని సౌకర్యాలు సమకూర్చడానికి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ 2019 జనవరిలో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఉత్తర్వులు జారీ చేశారు. వెంటనే జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం కక్షతో ఈ కేటాయింపును రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మరోవైపు ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల ఫలితంగా ఎట్టకేలకు 2020 అక్టోబరులో జగన్ ప్రభుత్వం తిరిగి రూ.10 కోట్లు మంజూరు చేస్తూ పనులు చేపట్టేందుకు అనుమతించింది. మాస్టర్‌ప్లాన్‌ను ఓ ప్రైవేట్ ఆర్కిటెక్ సంస్థచే రూపొందించారు. ఈ ప్రతిపాదనలో ఆర్చితో కూడిన ప్రవేశ ద్వారం వద్ద ప్లాజా నిర్మాణం, సందర్శకుల సౌకర్య కేంద్రాలు, వాటర్ ఫౌంటెన్, కళాత్మకమైన గ్రామీణ వాతావరణంతో వివిధ రకాల స్టాళ్ల ఏర్పాటు, చేతి వృత్తులు, కళాకారులకు శిక్షణ కేంద్రం, ఎంపోరియం, వివిధ స్మారక చిహ్నాలతో కూడిన దుకాణాలు, ఫుడ్‌కోర్టు, ఓపెన్ ఎయిర్ థియేటర్ ఆధునికీకరణ లాంటి పనులకు ఈ నిధులను వ్యయం చేయాల్సి ఉంది. గడచిన నాలుగేళ్ల వైసీపీ పాలనలో శిల్పారామం మాస్టర్ ప్లాన్ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి.

ఆ పది ఎకరాలపై దృష్టి పెట్టండి

శిల్పారామం పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిలో మరో పది ఎకరాలను కేటాయించడానికి అప్పటి ఉమ్మడి జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అంగీకరించారు. అందులో బోన్సాయ్, బటర్‌ఫ్లై, రాక్ గార్డెన్స్ ఏర్పాటుకు శిల్పారామం ఉన్నతాధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆ స్థలాన్ని సైతం వైసీపీ నేతలు కబ్జా చేయడానికి ప్రయత్నించారు.



కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి

స్థానికులకు మానసికోల్లాసం అందించడమేగాక ఏడాదికి సుమారు రూ.2 కోట్లు ఆదాయం వస్తున్న శిల్పారామంలో మాస్టర్‌ప్లాన్ పనులు వేగవంతం చేసి, కొత్త సొబగులు దిద్దితే సందర్శకుల సంఖ్యతోపాటూ జిల్లా పర్యాటకం కూడా అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా చంద్రబాబు ప్రభుత్వం దృష్టి సారించాలని నగరవాసులు కోరుతున్నారు.

- తిరుచానూరు, ఆంధ్రజ్యోతి

శ్రీసిటీని సందర్శించిన హిరోషిమా ప్రతినిధుల బృందం



శ్రీసిటీలో ప్రతినిధుల బృందం

శ్రీసిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యాధునిక వసతులు, వైవిధ్య భరితమైన పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ, వ్యాపార అనుకూల వాతావరణంలో నిర్మాణాత్మక పారిశ్రామిక పార్కును అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్య కృషిని హిరోహరు సకనే నేతృత్వంలోని బృందం అభినందించింది. జపాన్‌లోని హిరోషిమా రాష్ట్రానికి చెందిన నలుగురు సభ్యుల ప్రభుత్వ ఉన్నతాధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. హిరోహరు సకనే నేతృత్వంలోని బృందానికి శ్రీసిటీ మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.శివశంకర్ సాదర స్వాగతం పలికి శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, పారిశ్రామిక అనుకూలతలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. 30పైగా జపనీస్ పరిశ్రమల స్థాపనతో భారతదేశంలో రెండో అతిపెద్ద జపనీస్ పరిశ్రమల కేంద్రంగా శ్రీసిటీ గుర్తింపు పొందిందని వారికి వివరించారు. పర్యటనలో పాల్గొన్న ప్రతినిధులు శ్రీసిటీలోని వివిధ అంశాల గురించి విపులంగా అడిగి తెలుసుకున్నారు. హిరోషిమా అధికార ప్రతినిధుల బృందం పర్యటనపై శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. భారత్, హిరోషిమా మధ్య వ్యాపార బంధం మరింత బలపడేందుకు ఈ పర్యటన అత్యంత కీలకమైనదిగా ఆయన పేర్కొన్నారు. ప్రతినిధుల బృందంలో హిరోషిమా ప్రభుత్వ అధికారి యుదై హరున్, హిరోషిమా బ్యాంక్ లిమిటెడ్ అధికారులు తకుషి కొసాకా, హిరోకి ఒనిషి తదితరులు పాల్గొన్నారు.

రేపటినుంచి ఐఐటీలో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్

డైరెక్టర్ సత్యనారాయణ




తిరుపతి ఐఐటీ

ఏర్పేడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఐఐటీ ప్రాంగణం ఈనెల 11 నుంచి రెండు రోజుల పాటు స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ గ్రాండ్ ఫినాలేకు సిద్ధమవుతున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ తిరుపతి ఐఐటీకి ఈ అవకాశం రావడం గర్వకారణమన్నారు. దేశంలో ఆవిష్కరణలు, సాంకేతిక పురోగతికి నాయకత్వం వహించడానికి విద్యా మంత్రిత్వశాఖ గుర్తించిన 51 నోడల్ కేంద్రాల్లో తిరుపతి ఐఐటీ ఒకటిగా గుర్తింపబడిందన్నారు. ఇదో మైలు రాయి అన్నారు. హ్యాకథాన్ ఎలైట్ టీంల కలయికకు సాక్షమివ్వనుందని అభిప్రాయపడ్డారు. ప్రతి బృందంలో దేశవ్యాప్తంగా ఉన్న ఆరుగురు ప్రతిభావంతులైన కళాశాల విద్యార్థులు ఉంటారన్నారు. వీరు ఆయూష్ మంత్రిత్వశాఖ గుర్తించిన నాలుగు క్లిష్టమైన సమ్యల ప్రకటనలకు పరిష్కారం రూపొందించటానికి పోటీ పడతారన్నారు. ఈ పోటీల్లో పాల్గొనే టీంలు వారి అసాధారణమైన సమస్య-పరిష్కారం నైపుణ్యాలను వినూత్న ఆలోచనలు ఎంపిక చేయబడుతాయన్నారు. ప్రతి సమస్య ప్రకటనపై విజేతలకు భారత ప్రభుత్వం నగదు బహుమతులను అందించి సత్కరిస్తుందని తెలిపారు. యువతలో పరిశోధన, అభివృద్ధి, సంస్కృతిని ప్రోత్సహించటం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ గ్రాండ్ ఫినాలే భారతదేశ విద్యార్థుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వేదికగా మాత్రమే కాకుండా దేశ పురోగతిపై అర్థవంతమైన ప్రభావాన్ని చూపుతుందన్నారు. కొత్త తరం ఇంజనీర్లు, వ్యవస్థాపకులను పెంపొందించటంలో తిరుపతి ఐఐటీ ముందంజలో ఉందని ఆయన అన్నారు.

అధికారులూ.. అభినందనలు

అమ్మవారి బ్రహ్మోత్సవాల విజయవంతంపై ఎక్స్‌లో సీఎం పోస్ట్





తిరుచానూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో పద్మావతీ అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయడం పట్ల సీఎం చంద్రబాబు సోమవారం టీటీడీని అభినందించారు. ఎక్స్ వేదికగా అభినందనలు తెలిపారు. పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాల దివ్య వైభవాన్ని వీక్షించడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. టీటీడీ ప్రణాళికాబద్ధంగా ముందు చూపుతో ఏర్పాట్లు చేసుకుని క్షేత్రస్థాయిలో అమలు చేయడం వల్ల భక్తులందరికీ అమ్మవారి ఆశీస్సులు అందేలా చేశారని సీఎం అభినందించారు.

తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు

● కర్ణాటక భక్తుడి ట్వీట్‌కు ఎక్స్‌లో మంత్రి లోకేశ్ స్పందన

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'మీ తర్వాతి పర్యటనలో తిరుమలలో మరిన్ని మార్పులు చూస్తారు' అంటూ శ్రీవారి భక్తుడి ట్వీట్‌కు ఎక్స్ వేదికగా స్పందించారు మంత్రి నారా లోకేశ్. ప్రస్తుతం ఇది సోషల్ మీడియాలో ట్రెండింగ్‌గా మారింది. కర్ణాటకకు చెందిన కెంచా అనే పేరుతో ఎక్స్ వేదికగా తిరుమలలోని సౌకర్యాలపై ఓ భక్తుడు ట్వీట్ చేశారు. 'గతంతో పోలిస్తే తిరుమలలో పరిశుభ్రత ఉంది. మరుగుదొడ్లతో పాటు రోడ్లు కూడా శుభ్రంగా కనిపిస్తున్నాయి. శ్రీవారి దర్శన సమయం తగ్గడంతో పాటు క్యూలైన్ నిర్వహణ, అన్నప్రసాదాలు బాగున్నాయి. లడ్డూ నాణ్యత కూడా పెరిగింది. గతంలో లడ్డూ కేవలం రుచి చూసేవాడిని. ఇప్పుడు పూర్తి లడ్డూనే తింటున్నా. ఐదురోజులు ఉంచినా తాజాగా ఉంటోంది. ఎలాంటి కొరత లేకుండా లడ్డూలు ఇస్తున్నారు. ఇక, గదుల కొరత అధికంగా ఉంది. ఉచిత బస్సులు రద్దీగా ఉంటున్నాయి' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు. కర్ణాటక భక్తుడైన తాను ఏపీ రాజకీయాలను పెద్దగా పట్టించుకోనని పేర్కొన్నారు. తరచూ తిరుమలకు వచ్చే భక్తుడిగానే చెబుతున్నానని తెలిపారు. 'తిరుమలలోని మార్పులను ప్రశంసించడం చాలా సంతోషంగా ఉంది. సీఎం చంద్రబాబు పరిపాలన, దార్శనికత కారణంగానే తిరుమలలో పారిశుధ్యం, లడ్డూ రుచి, అన్నప్రసాదం నాణ్యత, శ్రీవారి దర్శనం మెరుగుపడ్డాయి. వసతి, ఉచిత బస్సులు వంటి సూచనలు పరిగణనలోకి తీసుకుంటాం. తర్వాతి మీ తిరుమల పర్యటనలో మరిన్ని మార్పులను చూస్తారు' అంటూ కర్ణాటక భక్తుడి ట్వీట్‌పై నారా లోకేశ్ స్పందించారు.

25 కేజీల గంజాయి స్వాధీనం

ఆరుగురి అరెస్టు



నాయుడుపేట టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నుంచి నాయుడుపేటకు గంజాయి సరఫరా చేస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు సోమవారం మీడియాకు వెల్లడించారు. నర్సీపట్నానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, వెంకటేష్, చక్రవర్తి, నాయుడుపేట పట్టణానికి చెందిన వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మకు గంజాయిని సరఫరా చేస్తుంటారు. ముందుగా అందిన సమాచారం మేరకు సోమవారం నాయుడుపేట రైల్వేస్టేషన్ సమీపంలో పోలీసులు నిఘా వేశారు. గంజాయి విక్రయిస్తున్న వెంకటేష్, చక్రవర్తి, వెంకయ్య, సుబ్బయ్య, మీరమ్మ, వెంకటమ్మను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్దనుంచి 25 కేజీల గంజాయి, 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. స్వాధీనం చేసుకున్న గంజాయి విలువ రూ.3 లక్షల విలువ ఉంటుందని చెప్పారు. కాగా, నర్సీపట్టణానికి చెందిన రాజ్‌కుమార్, బాబి, పరారయ్యారు. నిందితుల అరెస్టులో ప్రతిభ కనపరచిన అర్బన్ సీఐ బాబి, ఎస్ఐలు భవానీ లక్ష్మి, శ్రీనివాసులురెడ్డి, సిబ్బంది నాగూరయ్య, రామమోహన్‌రాజు, సాహుల్, భానుతేజ, పోలయ్య, మురళి, షాహిదా, చందన, సుప్రజను డీఎస్పీ అభినందించారు.

నేటితో ముగియనున్న పింఛన్ల పరిశీలన

తిరుపతి(మంగళం), డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అనర్హత పింఛన్ల ఏరివేతకు రూపొందించిన పైలెట్ కమిటీ ప్రాజెక్ట్ పరిశీలన మంగళవారంతో ముగియనుంది. రెండు రోజులుగా జరుగుతున్న ఈ పరిశీలనలలో 15 అనర్హత పింఛన్లను గుర్తించినట్లు డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు తెలిపారు. ఒక్కో జిల్లాలో ఎంపిక చేసిన గ్రామపంచాయతీ, వార్డు సెక్రటేరియట్ పరిధిలో పింఛనుదారుల వ్యక్తిగత పరిశీలన కొనసాగుతోందన్నారు. ఇందులో భాగంగా తిరుపతి జీవకోన వార్డు సచివాలయ పరిధిలో 355 పింఛనుదారులకు గాను 322 పరిశీలించామన్నారు. సోమవారం పరిశీలన ముగిసే సమయానికి 32 మందిని పరిశీలించాల్సి ఉందన్నారు. ఈ 32 మందిలో ఒకరు మరణించారని, 31 మంది వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నారన్నారు. మంగళవారం తనిఖీ ప్రారంభయమ్యే సమయానికి వారి చిరునామా గల నివాసాల వద్దకు చేరుకోవాలని ఆయన సూచించారు. ఈ పింఛనుదారుల పరిశీలనలో శ్రీకాళహస్తి డీఎల్‌డీవో సుస్మితరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రాధిక, పలువురు వెల్ఫేర్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మామిడి పంటకు బీమా నమోదు ప్రారంభం

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం కింద జిల్లాలో మామిడి పంటకు బీమా నమోదు ప్రక్రియ ప్రారంభమైందని ఉద్యానశాఖ అధికారులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకాన్ని 2024-25 రబీసీజన్‌కు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు సమీపంలోని బ్యాంకులోగాని లేదా మీసేవ, బీమా కంపెనీ నియమించిన వారి ద్వారానైనా ఎకరాకు రూ.1,750 ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చన్నారు. బ్యాంకు ఖాతా, ఆధార్‌కార్డు, భూమిపాసు పుస్తకం, పంట వేసినట్లు ధ్రువీకరణ పత్రాల జిరాక్సులను అందించాలన్నారు.

జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడలో బుధ, గురువారాల్లో సీఎంతో కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉంటుంది. దీనికోసం జిల్లా అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి' అని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ఆయన వివిధశాఖల వారీగా పురోగతిపై అధికారులతో సమీక్షించారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి పురోగతి సాధించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జేసీ శుభంబన్సల్, డీఆర్వో నరసింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 20 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు.. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు. ఇక, శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, రూ.3.58 కోట్లు ఆదాయం లభించినట్టు సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 73,107 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 22,721 మంది తలనీలాలు సమర్పించారు.

ముంగిలిపట్టు వద్ద అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



శ్రావణి (ఫైల్ ఫొటో)



కార్తీక్

చంద్రగిరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రగిరి మండలం ముంగిలిపట్టు వద్ద సోమవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ యువతి అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన శ్రావణి(23)గా గుర్తించారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. ముంగలిపట్టు వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి 8 గంటల సమయంలో గుర్తు తెలియని యువతి మృతదేహం రక్తపు మడుగులో పడుందని స్థానికులు పోలీసులకు సమాచారమిచ్చారు. ఎస్ఐ అనిత, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం వద్ద రెండు జతల చెప్పులున్నాయి. సాయంత్రం 6 గంటల సమయంలో బైక్‌పై తిరుపతి నుంచి ఓ యువకుడితో వస్తూ ఆమె ఏడుస్తూ వాదిస్తోందని కొందరు స్థానికులు పోలీసులకు తెలిపారు. పోలీసుల విచారణలో ఆమె పాకాల మండలం వడ్డేపల్లెకు చెందిన రవి కుమార్తె శ్రావణిగా తేలింది. తిరుపతిలో రిలయన్స్ మార్ట్‌లో పనిచేస్తోంది. ఆమెతో పాటు చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం కమ్మవాండ్లపల్లెకు చెందిన రామ్మూర్తి కుమారుడు కార్తీక్ కూడా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా వీరి మధ్య పరిచయం ఉంది. శ్రావణికి పెళ్లి సంబంధాలు చూస్తున్నారని తెలుస్తోంది. దీనిపై శ్రావణితో మాట్లాడేందుకు కార్తీక్ తిరుపతి నుంచి బైక్‌పై ముంగిలిపట్టుకు తీసుకొచ్చినట్లు తెలిసింది. కాగా, చంద్రగిరి జాతీయ రహదారి వద్ద కార్తీక్ ఉండటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతడు అప్పటికే మద్యం తాగి ఉన్నాడు. ఈ వాదులాట నేపథ్యంలో అతడు ఆమెను రోడ్డుపైకి తోసేశాడా లేదా శ్రావణి ఆత్మహత్య చేసుకొందా? లేక రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగిందా? అనే కోణాల్లో పోలీసులు విచారిస్తున్నారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అయినా తగ్గలేదు!

● ఆధార్ ప్రత్యేక శిబిరాల్లో ఇంకా తల్లిదండ్రుల పడిగాపులు



ఆధార్ శిబిరంలో రద్దీ

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):ఆధార్ అప్డేట్ శిబిరాల వద్ద రద్దీ ఏమాత్రం తగ్గలేదు.చిన్నారులతో చెట్టకింద, మెట్లమీద పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులే కన్పిస్తున్నారు. ఆధార్ అప్డేట్ శిబిరాలను మరిన్ని ఏర్పాటు చేయాలని, అందుబాటులో ఉన్న సచివాలయాల్లో ఆధార్ అప్డేట్ సౌకర్యం కల్పించాలని రాష్ట్ర అధికారులు ఎన్ని విన్నపాలు చేసుకుంటున్నా, కేంద్రం ప్రభుత్వంనుంచి స్పందన లేదు.

విద్యార్థులందరికీ యూనిక్‌గా ఒక నెంబర్ ఇచ్చి, క్యూ ఆర్ కోడ్‌తో కూడుకున్న అపార్ కార్డు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. అయితే అపార్ కార్డు నెంబర్ జనరేట్ కావాలంటే విద్యార్థుల స్కూల్, ఆధార్, బర్త్ రికార్డులన్నీ ఒకే విధంగా ఉండాలి. వారి పేర్లు, పుట్టిన తేదీలు, తల్లిదండ్రుల పేర్లు ఇంటిపేర్లతో సహా ఒక్క అక్షరమైనా తేడా లేకుండా కలవాలి. అక్షరానికీ, అక్షరానికీ మధ్య ఒక స్పేస్ తేడా వున్నా అపార్ కార్డు జనరేట్ కాదు. ముఖ్యంగా ఆధార్ కార్డులు తప్పుల తడకగా ఉన్నాయి. స్కూల్ రికార్డులకు, ఆధార్ కార్డుల్లోని వివరాలకు పొంతన లేదని అపార్ కార్డులకోసం స్కూళ్లలో ఉపాధ్యాయులు ప్రయత్నించినప్పుడు బయటపడింది. దీంతో ఆధార్ కార్డుల అప్డేషన్ తప్పని సరిగా మారింది. కుప్పం నియోజకవర్గమే తీసుకుంటే మొత్తం నియోజకవర్గంలో ఒకట్రెండు మీ సేవా కేంద్రాల్లో తప్ప ఇతర కేంద్రాల్లో ఆధార్ అప్డేషన్‌కు అనుమతి లేదు. మండలానికి ఒకట్రెండు సచివాలయాల్లో తప్ప, ఇతర సచివాలయాల్లో కూడా ఈ సౌకర్యం లేదు. సిబ్బంది కొరత వల్లనే సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయలేకపోతున్నామని అధికారులు చేతులెత్తేశారు. కుప్పం తపాలా కార్యాలయం వంటి ఆధార్ కేంద్రాలు నడుస్తున్న పరిమితమైన కేంద్రాలకు జనం గుంపులు కట్టారు. అప్పటికీ పది రోజుల క్రితం కుప్పం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనంగా ఒక ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయినా విద్యార్థులు, తల్లిదండ్రుల సమస్యలు తీరలేదు. రద్దీ కొనసాగింది. తల్లిదండ్రులనుంచి వినతులు వెల్లువెత్తడంతో స్పందించిన కడా పీడీ వికాస్ మర్మత్, ప్రత్యేక ఆధార్ శిబిరాలకోసం కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు ప్రతిపాదన పంపారు. ఆ ప్రతిపాదన పరిశీలించిన కలెక్టర్ ప్రత్యేక శిబిరాలను మంజూరు చేశారు.

● శిబిరాలలో కూడా తగ్గని రద్దీ

గుడుపల్లె మండలంలో ఈనెల 6, 7 తేదీల్లో ప్రారంభమైన ప్రత్యేక ఆధార్ శిబిరాలు ప్రస్తుతం కొనసాగుతున్నాయి. కుప్పం మండలంలో 9వ తేదీన మల్లానూరు, చందం తదితర పంచాయతీలలో ఆధార్ శిబిరాలు నిర్వహించారు. అలాగే మంగళవారం కూడా ఇదే మండలంలో మరో నాలుగైదు కేంద్రాల్లో ఈ శిబిరాలు నడుస్తాయి. కుప్పం మున్సిపాలిటీలో 11, 12 తేదీలలో, రామకుప్పం మండలంలో 16, 17 తేదీలలో, శాంతిపురం మండలంలో 18, 19 తేదీలలో ఆధార్ అప్డేషన్ ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నారు. అయితే ఆధార్ శిబిరాలు ఒక్కో మండలంలో కేవలం రెండు రోజులు మాత్రమే ఏర్పాటు చేసి అయిందనిపిం చేస్తున్నారు. ఇప్పటికే అపార్ కార్డు జనరేట్ ప్రక్రియ 70-75 శాతానికి మించి పూర్తయిందని జిల్లా అధికారులు ఎన్ని చెబుతున్నా, క్షేత్ర స్థాయిలో వాస్తవాలు వేరేగా ఉంటున్నాయి.ఇప్పటికీ ఆధార్ శిబిరాలకు తండోపతండాలుగా జనం వస్తున్నారు. మరి ఇంతమంది పిల్లలకు ఆధార్ అప్డేషన్ ఇంకా కానప్పుడు, దానిమీద ఆధారపడిన అపార్ నెంబర్లు ఎలా అంత స్థాయిలో జనరేట్ అవుతాయన్నదానికి అధికారులే సమాధానం చెప్పాల్సి ఉంటుంది. ఇటుచూస్తే ఆధార్ శిబిరాల్లో పాలుతాగే పసిబిడ్డలను చంకనేసుకుని మరీ తల్లిదండ్రులు పడిగాపులు కాస్తున్నారు. మల్లానూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం జరిగిన ప్రత్యేక ఆధార్ శిబిరంలో ఇదే పరిస్థితి కనిపించింది. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన తల్లిదండ్రులు బడుల్లో చదువుతున్న బిడ్డల ఆధార్ కార్డుల్లో తప్పులు సరిచేసుకోవడానికి ఇక్కడికి పిల్లా పాపలతో తరలివచ్చారు. గంటలకు గంటలు పడిగాపులు కాశారు. ఆధార్ శిబిరాలను ఏ ఒకట్రెండు రోజులో ఏర్పాటు చేసి తర్వాత మానుకోవడం కాకుండా, సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్లను కేటాయించి, కేంద్రంనుంచి అనుమతి పొంది ఆధార్ అప్డేషన్ సౌకర్యం కల్పించాలని వీరంతా కోరుతున్నారు.



మల్లానూరులో పిల్లాపాపలతో చెట్టుకింద పడిగాపులు కాస్తున్న తల్లిదండ్రులు

13న కృత్రిమ కాలుకు కొలతలు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు, తిరుపతి జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 13వ తేదీన విశాల్‌మార్ట్ పక్కన ఉన్న తపోవనంలో కృత్రిమ కాలుకు కొలతలు తీసుకునే కార్యక్రమం జరగనుంది. ఈ మేరకు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. కొలతలు తీసుకున్న 20 రోజుల తర్వాత కృత్రిమ కాలును ఉచితంగా అమర్చుతారన్నారు. అవసరమైన వారు కలెక్టరేట్‌లోని అంబేడ్కర్ భవన్‌లో ఉన్న విభిన్న ప్రతిభావంతుల కార్యాలయాన్ని సంప్రదించాలని కోరారు. ఆధార్, రేషన్‌కార్డులు, సదరం సర్టిఫికెట్, వికలత్వం కనిపించేలా రెండో ఫొటోలు, ఫోన్ నెంబరును తీసుకురావాలన్నారు. వివరాలకు రాజశేఖర్ నాయుడిని 94403 57522 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో 34 అర్జీలు



బాధితులతో మాట్లాడుతున్న ఏఎస్పీ రాజశేఖర్ రాజు

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి 34 అర్జీలు అందాయి. వీటిల్లో.. భూ తగాదాలపై 12, కుటుంబ తగాదాలపై 7, డబ్బు తగాదాలపై 5, ఇంటి తగాదాలపై 4, వేధింపులపై 3, దారి తగాదాలపై 2, ప్రేమ వివాహంపై ఓ అర్జీ వంతున అందాయి. బాధితుల నుంచి అర్జీలను ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ స్వీకరించారు. బాధితుల ఎదుటే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా న్యాయం చేయాలని సంబంధిత అధికారులను ఏఎస్పీ ఆదేశించారు.

బొమ్మసముద్రం సర్పంచ్‌కు సన్మానం



రఘునాథయ్యను సన్మానిస్తున్న డీపీవో సుధాకర్ తదితరులు

ఐరాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ హెల్దీ పంచాయతీగా ఎన్నికైన బొమ్మసముద్రం సర్పంచ్ రఘునాథయ్యను సోమవారం జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) సుధాకర్‌రావు, డీఎల్‌పీవో పార్వతి ఆధ్వర్యంలో సన్మానించారు. బొమ్మసముద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. జిల్లాలోని ప్రతి పంచాయతీ ఇలాంటి అవార్డులు తెచ్చుకోవాలన్నారు. ఎంపీడీవో ధనలక్ష్మి, ఈవోపీఆర్డీ కుసుమకుమారి, కార్యదర్శి మౌనిక, ఎంపీటీసీ విజయకుమారి, జనసేన నాయకుడు మహేష్, గ్రీన్‌అంబాసిడర్లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలు
● కారును వెంబడించి పట్టుకున్న గ్రామస్తులు




గాయపడ్డ రాకేష్, మేఘనాథన్

బంగారుపాళ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం పరదరామి తాలుకా పూజారి వలసకు చెందిన రాకేష్, మేఘనాథంలు బంగారుపాళ్యం మండలంలోని వెంకటాపురంలో మేస్త్రీ పని ముగించుకుని ద్విచక్రవాహనంలో సోమవారం రాత్రి సొంతూరుకు బయల్దేరారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలోని కేజీ సత్రం వద్దకొచ్చేసరికి పలమనేరు నుంచి చిత్తూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టి వెళ్లిపోయింది. దీన్ని గమనించిన గ్రామస్తులు కారును వెంబడించి మిట్టపల్లె టోల్‌ప్లాజా వద్ద పట్టుకుని.. పోలీసులకు అప్పజెప్పారు. ఈ ఘటనలో మేఘనాథన్ కాలు విరగ్గా, రాకేష్ తలకు తీవ్ర గాయమైంది. బాధితులను చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ మల్లప్ప తెలిపారు.

పట్టపగలే ఆవు చోరీ

● పోలీసుల అదుపులో ఆటో డ్రైవర్

వి.కోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): పాముగానిపల్లె పంచాయతీ పాత్తూరులో రాజగోపాల్‌గౌడు అనే రైతుకు చెందిన పాడిఆవును పట్టపగలే అపహరించారు. సోమవారం మధ్యాహ్నం రైతు తన పొలం వద్ద ఆవును కట్టి ఇంటికి వెళ్ళాడు. తిరిగి వచ్చేసరికి ఆవు కనిపించలేదు. ద్విచక్ర వాహనంలో వెతికేందుకు వెళ్లాడు. ఈక్రమంలో రామకుప్పం వైపు వెళ్తున్న ఆటోలో ఆవును గమనించాడు. వెంటనే వాహనాన్ని ఆపి డ్రైవర్‌ను ప్రశ్నించడంతో విషయం బయటపడింది. ఆవును కొనుగోలు చేసిన వ్యక్తి పరారయ్యాడు. పాత్తూరుకు చెందిన మణి రామకుప్పం మండలం గర్నపల్లెకు చెందిన ఓ వ్యక్తికి రూ.17 వేలకు ఆవును విక్రయించాడని డ్రయివర్ చెప్పాడు, బాడుగకు పిలిస్తే వచ్చినట్లు బదులిచ్చాడు. పోలీసులకు విషయం తెలియడంతో చేరుకుని ఆవును రైతు కు అప్పగించారు. ఆటోను సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇక్కడా రెవెన్యూ సమస్యలే

● కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 201 అర్జీలు




బాధితులతో మాట్లాడుతున్న కలెక్టర్, జేసీ, ఇతర అధికారులు ● కలెక్టరేట్‌కు వచ్చిన కార్వేటినగరం మండలం కొల్లాకుంట, పరిసర గ్రామస్తులు

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సదస్సులు జరుగుతున్నాయి. అయినా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 201 అర్జీలు రెవెన్యూ సమస్యలపైనే వచ్చాయి. బాధితుల నుంచి వినతిపత్రాలను కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసులు స్వీకరించారు. మొత్తం 241 అర్జీలు అందాయి.

ప్రధాన అర్జీలిలా..

● వ్యవసాయం చేసుకోవడానికి ప్రభుత్వ భూమిని కేటాయించాలని గుడిపాల మండలం గట్రాళ్లమిట్టకు చెందిన పలువురు యానాదులు కోరారు. కాలనీలో 40 కుటుంబాల వారు నివాసం ఉంటున్నామని చెప్పారు. కూలికెళితేనే పూట గడుస్తుందని తెలిపారు. భూమిచ్చి తమను ఆదుకోవాలని కోరారు.

● తన భర్త చనిపోయాడని, ఆయన పేరుపై ఉన్న ఆస్తిని తనపేరుపై మార్చాలని తహసీల్దార్‌ను పలుమార్లు కోరినా ఫలితం లేదని చిత్తూరు మండలం ఎల్‌బీపురంకు చెందిన వసంత ఫిర్యాదు చేశారు. రెండు వేర్వేరు సర్వే నెంబర్లలో 1.56 ఎకరాల భూమి తన భర్త పేరుపై ఉందని చెప్పారు. న్యాయం చేయాలని కోరారు.

● 'నడుము, రెండుకాళ్లు పనిచేయడం లేకపోవడంతో 85 శాతం వికలాంగత్వం ఉన్నట్లు డాక్టర్లు సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చారు. అయినా నాకు ద్విచక్రవాహనాన్ని మంజూరు చేయడం లేదు' అని నదుం మండలం కొత్తపల్లెకు చెందిన వెంకటస్వామి ఆవేదన వ్యక్తం చేశారు.

● తమ గ్రామంలో ఉన్న మద్యం షాపును అక్కడ నుంచి తరలించాలని కార్వేటినగరం మండలం కొల్లాకుంట, ముక్కరవానిపల్లె, సీకాయపట్టెడ, దాసినత్తంకు చెందిన మహిళలు డిమాండ్ చేశారు. పొలాల్లో తాగిన బాటిళ్లను వేయడమే కాకుండా, పనులు చేసుకుంటున్న మహిళలతో మందుబాబులు అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు.

సీఎం వస్తారు...జాగ్రత్త

యంత్రాంగానికి కడా పీడీ హెచ్చరిక



ప్రజలనుంచి వినతులు స్వీకరిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి ఈనెల చివరి వారంలో కుప్పం పర్యటనకు వస్తున్నట్లు కడా పీడీ వికాస్ మర్మత్ తెలిపారు. ఈనేపథ్యంలో అధికారులు మరింత చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వహించాలన్నారు. స్థానిక మండల సచివాలయంలోని సమావేశపు హాలులో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై ఆయన వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు అప్పగించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమం ముగిసిన అనంతరం అధికారులతో కడా పీడీ సమీక్ష నిర్వహించారు. వివిధ ప్రభుత్వ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల విషయంలో శ్రద్ధ తీసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల చివరి వారంలో కుప్పంలో పర్యటించనున్నారని చెప్పారు. ఆయనకు ఏ ఒక్క సమస్యపైనా ఫిర్యాదు అందకూడదనే లక్ష్యంతో పనిచేయాలన్నారు. ఇప్పటికే చేపట్టిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. సిమెంటు రోడ్డు నిర్మాణాలు, గోకులం షెడ్లను సీఎం వచ్చేనాటికి పూర్తి చేయాలన్నారు. గ్రీవెన్స్‌డే, లేదా కలెక్టర్, సీఎంవోకు గతంలో సమస్యలు వెళ్లివుండి పరిష్కరించలేకపోతే అందుకు కచ్చితమైన సమాచారం ఉంచుకోవాలని ఆదేశించారు.

నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల గుట్టురట్టు

ముగ్గురిపై కేసు నమోదు

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): సంచలనం సృష్టించిన నకిలీ జనన ధ్రువీకరణ పత్రాల గుట్టురట్టయింది. దీనికి బాధ్యులైన ముగ్గురు నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటమోహన్ కథనం మేరకు వివరాలు.. కొందరు పంచాయతీ కార్యదర్శులు నకిలీ జననధ్రువీకరణ పత్రాలను గుర్తించి అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్డీవో శ్రీనివాసరాజు, తహశీల్దారు బాబు, ఎంపీడీవో లక్ష్మీకాంత్, సీఐ మల్లేష్‌యాదవ్ ఇటీవల మండలంలోని పలు నెట్ సెంటర్లను తనిఖీ చేశారు. నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారీ, పంపిణీ జరిగినట్లు గుర్తించారు. రామకుప్పంతో పాటు వీర్నమల, ముద్దనపల్లెల్లోని నెట్‌సెంటర్లలో ఈ వ్యవహారాలు నడిచినట్లు గుర్తించారు. రామకుప్పంలో నవీన్, వీర్నమలలో మాజీ వలంటీర్ బాలూనాయక్, ముద్దనపల్లె అక్రమ్‌లు నెట్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. అధికారులు వారిని విచారించడంతో విషయాలు వెలుగుచూశాయి. బాలూనాయక్ మధ్యప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తితో వాట్సాప్ ద్వారా పరిచయం పెంచుకున్నాడు. ఆ వ్యక్తి ద్వారా డాష్‌బర్త్.ఇన్.నెట్ అనే వెబ్‌పోర్టల్ యాక్సెస్ తీసుకున్నాడు. ఆ పోర్టల్ ద్వారా నకిలీ జనన ధ్రువీకరణ పత్రాలు తయారీ, విక్రయాలకు తెరదీశాడు. ఇక్కడి వ్యక్తుల వివరాలను అక్కడకు పంపి పత్రాలను వెబ్‌పోర్టల్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునేవాడు. ధ్రువీకరణ పత్రానికి రూ.200 చెల్లించేవాడు. ఇక్కడ వీటికి రూ.1000 నుంచి రూ3000 వరకు వసూలు చేసేవాడు. పత్రాల తయారీకి బాలూనాయక్ అనంతపురం జిల్లా కమలపాడు పంచాయతీ కార్యదర్శి, జగ్గంపేట మున్సిపాల్టీ పేరిట డిజిటల్ సంతకాలతో ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేవాడు. అదే విధంగా నవీన్, అక్రమ్ మరో ముగ్గురితో ముఠాగా ఏర్పడి నకిలీ పత్రాల దందా సాగించారు.శాంతిపురం మండలం రాళ్ళబూదుగూరు, కర్లగట్ట, రామకుప్పం పంచాయతీ కార్యదర్శులు లాగిన్లలో డిజిటల్ సంతకాలతో నవీన్ సర్టిఫికెట్లను అమ్మేవాడు. బైరెడ్డిపల్లె, వాల్మీకిపురం తదితర ప్రాంతాల్లో అక్రమ్ ఈ తరహా కార్యకలాపాలకు పాల్పడేవాడు. వీరు సర్టిఫికెట్‌కు రూ.1000 నుంచి రూ.2500 వరకు విక్రయించి సొమ్ము చేసుకునేవారు. గతనెల 10 నుంచి ఈ దందా సాగుతోంది. నవీన్, అక్రమ్, బాలూనాయక్‌లకు సహకరించిన వారి వివరాలు పూర్తిగా తెలియడంలేదు. నవీన్, అక్రమ్, బాలూనాయక్‌లపై కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తునట్టు ఎస్ఐ తెలిపారు.

పెట్రేగుతున్న బియ్యం స్మగ్లర్లు

పుత్తూరు కేంద్రంగా

● పట్టుబడిన 2,250 కిలోల రేషన్ బియ్యం
● ముగ్గురు నిందితుల అరెస్టు



గోదాముకు తరలిస్తున్న రేషన్ బియ్యం

పుత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పుత్తూరు కేంద్రంగా రేషన్ బియ్యం ముఠా పెట్రేగిపోతోంది. తమిళనాడు సరిహద్దు ప్రాంతం కావడంతో అవలీలగా రేషన్ బియ్యాన్ని తరలించేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ బియ్యం పక్కదారి పడుతుండటంతో ప్రభుత్వం ప్రత్యేక నిఘా విభాగం ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో పుత్తూరు కేంద్రంగా రూ.2.05 కోట్ల రేషన్ బియ్యాన్ని సీఎస్‌డీటీ విష్ణు నల్లబజారుకు తరలించిన సంఘటన తెలిసిందే. తాజాగా 2,250 కిలోల రేషన్ బియ్యం స్థానిక కాపు వీధిలో ఓ ముఠా తరలిస్తుండగా పోలీసులకు పట్టుబడింది. బియ్యాన్ని సీజ్ చేసిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. సీఐ సురేంద్రనాయుడు ఆదేశాల మేరకు కేసు నమోదు చేశారు. కాగా, ఈ నెల 3న రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు, ఈ ముఠా వెనుక ఎవరు ఉన్నారన్న కోణంలో దర్యాప్తు చేపట్టారు. పుత్తూరు, పిచ్చాటూరు పౌర సరఫరాల శాఖ గోదాంలో జరిగిన బియ్యం అవినీతి ముఠా హస్తంపై విచారించారు. చివరకు పట్టుబడిన నిందితులు చిన్న వ్యాపారులుగా గుర్తించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాకు సంబంధించి లక్ష్మి, చిన్న, అమృతరాజ్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు. సోమవారం పట్టుబడిన బియ్యాన్ని పుత్తూరు పౌరసరఫరాల శాఖ గోదాంకు తరలించారు.

21 నుంచీ డిగ్రీ మొదటి సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు) డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ పరిధిలో డిగ్రీ బీఏ, బీకాం, బీఎస్సీ తదితర కోర్సులకు సంబంధించిన మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 21వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను పరీక్షల విభాగం చేపడుతోంది. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ పరీక్షలు నిర్వహిస్తారు.

3,5 సెమిస్టర్ల పరీక్షల్లో నలుగురు డీబార్

ఎస్వీయూ పరిధిలో ప్రస్తుతం నిర్వహిస్తున్న డిగ్రీ 3, 5 సెమిస్టర్ పరీక్షల్లో నలుగురు విద్యార్థులు డీబార్ అయ్యారు. పరీక్షలను పర్యవేక్షిస్తున్న హైపవర్ కమిటీ చిత్తూరులో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్న నలుగురిని డీబార్ చేసినట్లు సీఈ దామ్లానాయక్ తెలిపారు.

సినిమాకెళ్దామని తీసుకెళ్లి అత్యాచారం

వెదురుకుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని పళ్లిపట్టులో సినిమా చూసొద్దామని తీసుకెళ్లి బాలికపై అత్యాచారానికి పాల్పడిన ఉదంత మిది.ఈ ఘటనపై ఎస్ఐ రాజ్‌కుమార్ సోమవారం కేసు నమోదు చేశారు.కార్వేటినగరం మండలంలోని ఓ ఎస్సీ కాలనీకి చెందిన బాలిక(17) ను మరో ఎస్సీ కాలనీకి చెందిన యువకుడు ఆదివారం రాత్రి పళ్లిపట్టులో సినిమాకు వెళదామని మాయమాటలతో నమ్మించి వెంట తీసుకెళ్లాడు.బాలిక వూరి సమీపంలోనే పొలంలోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని, ఆమె తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేశారు.

శబరిమలైకు 34 ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాదు కేంద్రంగా సికింద్రాబాదు, కాచికూడ, మౌలాలి, హైదరాబాదు రైల్వేస్టేషన్ల నుంచి శబరిమలై భక్తుల సౌకర్యార్థం రేణిగుంట మీదుగా 34 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్‌వో శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు.హైదరాబాదు నుంచి ప్రత్యేక రైలు(07065) జనవరి 7, 14, 21, 28 తేదీల్లో రాత్రి 12 గంటలకు బయలుదేరి బేగంపేట, కడప, రేణిగుంట, కాట్పాడి మీదుగా మరుసటి రోజు సాయంత్రం 4.10 గంటలకు కొట్టాయానికి చేరుకుంటుంది. తిరిగి కొట్టాయంలో ఈ ప్రత్యేక రైళ్లు (07066) జనవరి 8, 15, 22, 29 తేదీల్లో ఉదయం 6.10 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 11.45 గంటలకు చేరుకుంటాయి. ●జనవరి 3, 10, 17, 24, 31 తేదీల్లో మౌలాలిలో ప్రత్యేక రైలు(07167) మధ్యాహ్నం 2.30 గంటలకు బయలుదేరి చర్లపల్లి, నల్గొండ, గుంటూరు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కాట్పాడి మీదుగా మరుసటి రోజు సాయంత్రం 6.45 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. కొట్టాయంలో జనవరి 4, 11, 18, 25 తేదీల్లో రాత్రి 9.45 గంటలకు బయలుదేరి వచ్చిన మార్గంలో సికింద్రాబాదుకు మరుసటి రోజు రాత్రి 01.30 గంటలకు చేరుకుంటుంది. ●కాచిగూడలో జనవరి 5, 12, 19, 26 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07169) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి మల్కాజ్‌గిరి, గుంటూరు,నెల్లూరు, రేణిగుంట, కాట్పాడి మీదుగా సాయంత్రం 6.50 గంటలకు కొట్టాయం చేరుకుంటుంది. తిరిగి (07170) జనవరి 6, 13, 20, 27 తేదీల్లో కొట్టాయంలో రాత్రి 8.50 గంటలకు బయలుదేరి మరుసటి రోజు రాత్రి ఒంటిగంటకు కాచిగూడకు చేరుకుంటుంది.● మౌలాలిలో ఈ ప్రత్యేక రైలు (07171) జనవరి 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు బయలుదేరి భువనగిరి, ఖమ్మం, విజయవాడ, రేణిగుంట, కాట్పాడి మీదుగా మరుసటి రోజు రాత్రి 10.30 గంటలకు కాయకొళ్లాంకు చేరుకుంటుంది. తిరిగి ఈ ప్రత్యేక రైలు (07172) కాయకొళ్లంలో జనవరి 6, 13, 20, 27 తేదీల్లో రాత్రి 2.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 11 గంటలకు మౌలాలి చేరుకుంటుంది.

టీడీఆర్ బాండ్ల విచారణ వేగవంతం

తిరుపతి, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో టీడీఆర్ బాండ్ల కుంభకోణంపై నివేదికకు తుదిరూపు ఇచ్చేందుకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) సిద్ధమైంది. విచారణ నిమిత్తం రికార్డులను తీసుకు రావాలని ఆదేశించింది. ఈమేరకు విజయవాడ వడ్డేశ్వరంలోని డీఎంఏ కార్యాలయానికి అధికారులను డిప్యుటేషన్‌పై పంపించాలని టౌన్‌ప్లానింగ్ రీజనల్ డైరెక్టర్ జి.ఆర్.సంజీవ్ కుమార్ తిరుపతి కమిషనర్ మౌర్యను నాలుగు రోజుల క్రితం లిఖితపూర్వకంగా కోరారు. టౌన్‌ప్లానింగ్ డిప్యూటీ సిటీ ప్లానర్ ఎస్.మహాపాత్ర, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు పి.వినయ్ కుమార్, వై.పురుషోత్తం రెడ్డి, డి.శ్రవణ్ కుమార్‌లు రికార్డులతో డీఎంఏ కార్యాలయానికి రావాలని పేర్కొన్నారు. కాగా టౌన్ ప్లానింగ్ సెక్రటరీలు గత వైసీపీ నేతలకు అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వంలో తిరుపతిలో టీడీఆర్ బాండ్ల జారీలో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విచారణకు ఆదేశించింది. ఇందులో భాగంగా జరిగిన శాఖాపరమైన విచారణలో డీఎంఏకు చేరిన నివేదికపై ప్రభుత్వ పెద్దలు అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. మరింత సమగ్ర విచారణకు అనంతపురం టౌన్ ప్లానింగ్ ఆర్డీ నేతృత్వంలో డీఎంఏ కార్యాలయంలో విచారణ చేపట్టనున్నారు. దీనికి సంబంధించిన రికార్డులను వెంటపెట్టుకుని రావాలని డీసీపీతో పాటు వార్డు సెక్రటరీలను ఆదేశించినట్లు సమాచారం.



సమతుల్య ఆహారంతో గర్భవతులకు ఆరోగ్యం

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారంతో గర్భవతుల ఆరోగ్యం సాధ్యమని ప్రభుత్వ వైద్యాధికారులు యల్లయ్య, రమ్యశ్రీ అన్నారు. పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమాన్ని వారు నిర్వహించారు. గర్భవతులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారితో సమావేశంలో ఏర్పాటు చేశారు. గర్భవతులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే బిడ్డ ఎదుగుదల ఉంటుందన్నారు. కిల్కార్ సేవలు తప్పనిసరిగా అందాలన్నారు.


ఆరోగ్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

నిబంధనల ప్రకారం గోకులం షెడ్లు నిర్మించాలి

రొంపిచెర్ల,డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వం నిర్ణయించిన కొలత మేర గోకులం షెడ్లు నిర్మించాలని ఉపాధి హామీ అధికారులు పేర్కొన్నారు. సోమవారం బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలో గన్నిమిట్టవారిపల్లెలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ మురళి, మల్లికార్జున, ఫీల్డ్అసిస్టెంట్ సుబ్రమణ్యం గోకులాలు పరిశీలించారు. పనులు చేసిన వరకు కొలతలు నమోదు చేశారు. ఈసందర్భంగా మండలంలో 86 మంజూరు చేయగా 81 గోకులాల్లో దశల్లో వివిధ పనులు జరుగుతున్నాయన్నారు. పనులు తేడాలు తేకుండా చేయాలని సూచించారు. పనులను బట్టి బిల్లులు చెల్లిస్తామని స్పష్టం చేశారు.


గోకులం షెడ్డు పనులను పరిశీలిస్తున్న అధికారులు

సమస్యల పరిష్కారానికి కృషి: చల్లాబాబు

రొంపిచెర్ల,డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ టీడీపీ ఇన్చార్జి చల్లారామచంద్రారెడ్డిని సోమవారం సోమల, పులిచెర్ల, రొంపిచెర్ల, సదం మండలాల టీడీపీ నాయకులు, కార్యకర్తలతో పాటు రొంపిచెర్ల సర్పంచ్ ఆర్.ఇబ్రహీంఖాన్ కలిశారు. వివిధ సమస్యలను ఆయనకు వివరించారు. రొంపిచెర్లలోని ఉర్దూ పాఠశాల ప్రహరీ గోడ, బాలుర ఉన్నత పాఠశాలలో మరుగదొడ్లు, సమావేశం స్టేజ్ నిర్మాణం గురించి చర్చించారు. చల్లాబాబు స్పందిస్తూ మెగా తల్లిదండ్రుల సమావేశంలో ఈ సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. పరిష్కారానికి చర్యలు తీసుకుంటానన్నారు. ఆయనను కలిసిన వారిలో నాయకులు శ్రీనివాసులురెడ్డి, మోహన్‌రెడ్డి, అమరనాథ్, సుబ్రమణ్యంనాయుడు, పోతబోలు శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

శ్మశాన ఆక్రమణ సమస్య పరిష్కారం

చౌడేపల్లె, డిసెంబరు9: రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆర్డీవో భవాని పేర్కొన్నారు. సోమవారం దుర్గసముద్రం పంచాయతీలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆమె మాట్లాడుతూ. భూ సమస్యలతో పాటు పలు సమస్యలు పరిష్కారం కోసమే కూటమి ప్రభుత్వం ఈ సదస్సులు ఏర్పాటు చేసిందన్నారు. భూ సమస్యలపై 25 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ హనుమంతు తెలిపారు. దుర్గసముద్రం శ్మశాన ఆక్రమణ సమస్యను పరిష్కరించారు. సర్వేయర్ గుణ, వీఆర్వో బాలాజి, దేవదాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీవో భవానీ

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో వసతుల కల్పనకు హామీ

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక గణేశ్‌పురం మార్గంలోని ఆర్డీవో కార్యాలయంలో సోమవారం డివిజనల్ స్థాయి ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ సమావేశం నిర్వహించారు. ఆర్డీవో శ్రీనివాసరాజ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చించారు. ఆయా వర్గాలు నివసించే కాలనీలు, గ్రామాలలో సౌకర్యాల లేమిపై ప్రతినిధులు ఏకరువు పెట్టారు. సమస్యలను సాధ్యమైనంత త్వరలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆర్డీవో వారికి హామీ ఇచ్చారు. సమావేశంలో కుప్పం ఎంపీడీవో సాయి లహరి, శాంతిపురం, రామకుప్పం, గుడుపల్లె ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసరాజు

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి: బైరెడ్డిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యసంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ప్రతినెలా క్రమం తప్పకుండా గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందజేస్తున్న మహతిఫౌండేషన్ వారికి వైద్యసిబ్బంది, గర్భిణులు కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ సాయిశ్రీ, సీహెచ్‌వో అనురాధ, ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి, ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాసులు, పాల్గొన్నారు. తీర్థం పీహెచ్‌సీలో వైద్యాధికారి అరుణ్‌కుమార్ గర్భవతులకు సూచనలిచ్చారు.



కమనీయంగా వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం

సోమల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సమీపంలోని వేంకటేశ్వరస్వామి పాదాల ఆలయంలో తిరుకల్యాణ మహోత్సవాల నేపథ్యంలో సోమవారం కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణలు జరిపి అభిషేక పూజలు జరిపారు. విశ్వక్సేన ఆరాధన, లఘుపుణ్యాహవాచనం, కలశారాధన, సుదర్శన హోమం, పూర్ణహుతి, అష్టావధాన, కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామి వార్ల కల్యాణ మండపాన్ని సుందరంగా పుష్పాలతో అలంకరించి భూనీళాదేవి సమేత శ్రీవారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా ఉభయదారులు డాక్టర్ ప్రదీప్ కుమార్ దంపతులు జరిపించారు. బెంగళూరులో స్థిరపడిన ఎక్కల కృష్ణమూర్తి శెట్టి వెండిపాదుకలను వితరణ చేశారు. ఆలయ ధర్మకర్త చంద్రశేఖర్ పాల్గొన్నారు.



క్వారీ పేలుళ్లకు కూలిన ఇంటిస్లాబ్: బాధితుడి ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): క్వారీ పేలుళ్ల వల్ల తమ ఇంటిస్లాబ్ ఆదివారం రాత్రి కూలిపోయిందని గడ్డూరుకు చెందిన గుడ్డూ సాహెబ్ కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు... గ్రామ సమీపంలోని క్వారీలో రాళ్లను పేల్చి పగులగొట్టడంతో తమ ఇంటి గోడలు బీటలు వారుతున్నాయన్నారు. ఆదివారం ఈ ప్రకంపనలకు ఇంటి ముందువున్న స్లాబ్ కూలిపోయిందన్నారు. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. అధికారులు స్పందించి పేలుళ్లు జరగకుండా చర్యలు చేపట్టాలని కోరారు. క్వారీపై ఇటీవల కలెక్టరుకు కూడా ఫిర్యాదు చేశామని గ్రామస్థులు చెప్పారు.



రహదారి సమస్యపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గంగవరం, డిసెంబరు09,(ఆంధ్రజ్యోతి): పొలాలకు వెళ్లడానికి దారిలేకుండా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కీలపల్లె గ్రామ రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు... గ్రామంలో ముప్పై ఏళ్లుగా పొలాలకు ఒకే దారిలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో గ్రామానికే చెందిన ఓ వ్యక్తి దౌర్జన్యంగా రోడ్డును ఎక్సవేటర్‌తో తవ్వేసి మామిడి చెట్లను నాటేశాడన్నారు. అధికారులకు ఫిర్యాదు చేయగా హెచ్చరించి పంపేశారన్నారు. కానీ కొద్దిసేపటికే మళ్లీ దారిలో అడ్డగిస్తున్నాడని వాపోయారు. తాజాగా తమ ఫిర్యాదుపై కలెక్టర్ స్పందించి దారి సమస్య పరిష్కరించాలని ఆక్రమణదారుపై చర్యలు తీసుకోవాలని తహసీల్దారును ఆదేశించారన్నారు.

చంద్రమాకులపల్లె విద్యార్థుల క్రీడాప్రతిభ

పుంగనూరు రూరల్, డిసెంబరు9(ఆంధ్ర జ్యోతి):జోనల్ గేమ్స్ త్రోబాల్‌పోటీల్లో చంద్రమాకులపల్లె హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీదేవి తెలిపారు. సోమవారం సోమల మండలం కందూరులో జరిగిన క్రీడల్లో తమ పాఠశాల బాలికలు ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.



పలమనేరు

కుప్పం/పుంగనూరు

ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రప్రదేశ్): కొంగనపల్లెలో సోమవారం ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. 50మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య సలహాలిచ్చారు. కార్యక్రమంలో డాక్టరు తిలక్, ట్రస్టు వైద్య సిబ్బంది జాన్సీ, పార్థసారథి, మాజీ ఎంపీపీ చిన్నికృష్ణ, చలపతి, కొళ్ళపల్లెబాబు, మునస్వామిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

వడ్డీ వ్యాపారస్తులపై ఫిర్యాదు


విలేకరులతో మాట్లాడుతున్న అశోక్‌కుమార్

పుంగనూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వడ్డీ వ్యాపారస్తుల చేతిలో చిన్న వ్యాపారులు ఇబ్బందులు పడుతూ ప్రాణాలు తీసుకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తమిళనాడుకు చెందిన కొంతమంది వడ్డీ వ్యాపారస్తులు తక్కువ వడ్డీతో రుణాలు ఇస్తామని చిల్లర దుకాణాలు, చిన్నచిన్న వ్యాపారస్తులను నమ్మిస్తున్నారన్నారు. వీరి వేధింపులతో కుటుంబాలు పోషించడం ఇబ్బందిగా మారి కొంతమంది ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు


త్రిలోక్‌నాథ్- దుర్గ

పుంగనూరు రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంఎం పెట్రోల్ బంక్ వద్ద రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి గుడిసిబండ పంచాయతీ కొండసముద్రంకు చెందిన దంపతులు త్రిలోక్‌నాథ్, దుర్గ ద్విచక్రవాహనంలో పుంగనూరు నుంచి ఇంటికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనం ఢీకొంది. ప్రమాదంలో భార్య, భర్తలు గాయపడ్డారు. వీరిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు.

11న పుంగనూరులో జాబ్‌మేళా

పుంగనూరు రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): గూడూరుపల్లె సమీపంలోని ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కాలేజీ ఆవరణలో ఈనెల 11న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసుండి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ చదివిన యువతీ, యువకులు ఇంటర్వ్యూల్లో పాల్గొనవచ్చన్నారు. బయోడేటాతో పాటు సర్టిఫికెట్లు జిరాక్స్‌లు, ఆధార్ తీసుకురావాల్సి ఉంటుందన్నారు. 780599208 నంబరులో సంప్రదించాలని కోరారు.

మున్సిపల్ పారిశుధ్య కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.31వేతనం ఇవ్వాలని కోరారు. మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సచివాలయ సెక్రటరీల వేధింపులను అరికట్టాలన్నారు. ప్రతి కార్మికుడికీ రెయిన్‌కోట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేతలు దాసరి చంద్ర, రమాదేవి, గోపీనాథ్, మణి, విజయ్‌కుమార్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నేతలు దొరస్వామి, జయశంకర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దాడిలో మహిళకు గాయాలు

పుంగనూరు రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): చెత్త వివాదంలో జరిగిన దాడిలో ఓ మహిళ గాయపడింది. పెద్దపంజాణి మండలం పెద్దారికుంటకు చెందిన మంగమ్మకు మునిరత్నం కుటుంబంతో చెత్త విషయంలో వివాదం జరిగింది. ఘర్షణకు దిగారు. మంగమ్మను మునిరత్నం కుటుంబసభ్యులు కొట్టడంతో తలకు బలమైన గాయం తగిలింది. మంగమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మంగుంటలో వారం కిందట పట్టపగలే భువనేశ్వరి ఇంట్లో 10గ్రాముల బంగారం, చంద్రబాబురెడ్డి ఇంట్లో రూ.20వేలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుడిపాల మండలం రామాపురం చెందిన ఎన్.రమేష్ కుమారుడు రాజేష్ (32)ను నిందితుడిగా గుర్తించారు. అతడిని జీడీనెల్లూరు మండలంలోని రాజా చెక్‌పోస్టు వద్ద సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.90వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కి తరలించినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.

89పెద్దూరు-అంబూరు రహదారిపై ఆశల చిగురింత

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): 89పెద్దూరు-అంబూరు రహదారి ఏర్పాటు కలగానే మిగిలింది. ఈ రహదారి రాజకీయ నేతలకు ఎన్నికల ప్రచారాస్త్రంగానే ఉంటోంది. ఈ గ్రామం నుంచి అటవీ ప్రాంతం మీదుగా తమిళనాడులోని అంబూరుకు చాన్నాళ్ల క్రితం మట్టిరోడ్డు ఉండేది. కాలక్రమంలో ఈ రహదారి పూర్తిగా మూసుకుపోయింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మంత్రులు గ్రామంలో పర్యటించిన ప్రతిసారి రహదారి ఏర్పాటు చేస్తామని హామిలిచ్చారు. ప్రతి ఎన్నికల్లో నేతలు కూడా హామీలు గుప్పిస్తునే ఉన్నారు. 2017లో మండల టీడీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కాలినడకన అంబూరు వరకు రహదారిని పరిశీలించారు. అంబూరు శాసనసభ్యుడితో పాటు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులను కలిసి వివరించారు. వారు సానుకూలత వ్యక్తం చేస్తూ తమ ప్రభుత్వానికి నివేదిక పంపుతామన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఈ విషయం పూర్తిగా మరుగున పడింది. 2022లో స్థానిక వైసీపీ నేతల ప్రకటన కూడా కార్యరూపం దాల్చలేదు. ఈ రహదారి ఏర్పాటైతే బెంగళూరు, చెన్నైల మధ్య 65కి.మీ. దూరం తగ్గుతుంది. మండలంతో పాటు నియోజకవర్గం వాణిజ్య పరంగా అభివృద్ధి చెందుతుంది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడంతో ఈ రహదారిపై మళ్లీఆశలు చిగురించాయి. టీడీపీ నేతల చొరవతో రోడ్డు నిర్మించేలా చూస్తారని ప్రజలు విశ్వసిస్తున్నారు.


89పెద్దూరు అటవీ ప్రాంతంలో అంబూరుమార్గం

టీడీపీ నాయకుడి మృతికి చల్లాబాబు నివాళి

కల్లూరు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు రిజర్వాయర్‌లో పడి మృతి చెందిన రెడ్డివారిపల్లి పంచాయతీ తురకపేట టీడీపీ నాయకుడు షఫిఅల్లాకు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ చల్లా రామచంద్రారెడ్డి నివాళులర్పించారు. సోమవారం మృతదేహాన్ని సందర్శించారు. మృతదేహంపై పార్టీ జండా కప్పారు. మృతికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టీడీపీ నాయకులు కుమార్‌రెడ్డి, ధనంజయనాయుడు, వెంకటరమణ, నజీర్, రవినాయుడు, చంద్రారెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రభాకర్, మాధవరెడ్డి తదితరులు ఉన్నారు.


షఫిఅల్లా మృతదేహానికి నివాళి అర్పిస్తున్న చల్లా రామచంద్రారెడ్డి

రెవెన్యూ గ్రామ సభలకు ఆదరణ

కుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామ సభలకు ప్రజలనుంచి ఆదరణ లభిస్తోంది. రీ సర్వే పొరపాట్లే కాదు, భూముల ఆక్రమణలు, అన్యాయాల గురించి కూడా ఫిర్యాదు చేస్తున్నారు. కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఈనెల 6నుంచే రెవెన్యూ గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. రోజుకు కనీసం రెండుమూడు గ్రామ సభలకు తక్కువ కాకుండా నిర్వహిస్తున్నారు. సోమవారం మల్లానూరు, అడవిములకలపల్లెల్లో రెవెన్యూ గ్రామ సభలు జరిగాయి. తహశీల్దారు చిట్టిబాబు హాజరయ్యారు. ప్రజలు వినతిపత్రాలతో క్యూకట్టారు. తమ అర్జీలను ముందుగా రెవెన్యూ సిబ్బందికి ఇచ్చి, రిజిస్ట్రేషన్ చేసుకుని రశీదు తీసుకున్నారు. అనంతరం తహసీల్దారును కలిసి, సమస్యలను విన్నవించి పరిష్కారాలు పొందారు. కొన్ని సమస్యలను అక్కడే అధికారులు పరిష్కరించారు. కున్నారు. మిగిలిన వాటికి ఫలానా తేదీలోగా పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో రెవెన్యూ గ్రామ సభలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి.


మల్లానూరులో సమస్యలు వింటున్న తహసీల్దారు చిట్టిబాబు

అత్యాశకు పోయి జైలుపాలు కావద్దు: డీఎస్పీ

రామకుప్పం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): అత్యాశకు పోయి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి జైలుపాలు కావద్దని డీఎస్పీ పార్థసారథి హితవు పలికారు. సోమవారం వీర్నమల, ఆరిమానిపెంట గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. గంజాయి సాగు, సారా తయారీ, రవాణ, విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సైబర్ నేరాల పట్ల కూడా ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్లలో వచ్చే మోసపూరిత మేసేజ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. చోరీల నిరోధానికి స్మార్ట్‌లాక్‌లను వాడాలని సూచించారు. గ్రామీణ సీఐ మల్లేష్ యాదవ్, రామకుప్పం ఎస్‌ఐ వెంకటమోహన్, టీడీపీ నేతలు జేయి, భూపతి, పాండియన్, లోకేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

పుంగనూరు డిగ్రీకాలేజీ అభివృద్ధికి సహకరించండి

● నాక్ కమిటీకి పూర్వ విద్యార్థుల వినతి

పుంగనూరు, డిసెంబరు9 (ఆంధ్రజ్యోతి): స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అభివృద్ధికి సహకరించి సమస్యల పరిష్కారానికి సహకరించాలని నాక్ కమిటీ బృందానికి పూర్వ విద్యార్థుల అసోసియేషన్ కోరింది. సోమవారం స్థానిక కాలేజీలో న్యాక్ కమిటీ టీం అధ్యక్షుడు డాక్టర్ సంజీవ్ మిట్టల్, డాక్టర్ ఆసీమా సాహు,డాక్టర్ మహ్మద్‌అలీ పల్లి పరంబిల్ కాలేజీని సందర్శించారు. అనంతరం పూర్వ విద్యార్థులతో జరిగిన సమావేశంలో వారు పాల్గొన్నారు. కాలేజీకి ప్రహరీ గోడ నిర్మించాలని, సైన్స్ పరికరాలు సమకూర్చాలని, మినీ స్టేడియం నిర్మాణానికి నిధులు కేటాయించాలని పూర్వవిద్యార్థుల సంఘ నాయకులు కమిటీని కోరారు. కాలేజీలో తాము చేపట్టిన పనులు సంఘ నాయకులు ఆర్.హరినాథరెడ్డి, త్యాగరాజు, విజయశంకర్, శైలేంద్ర,గిరిధర్, ఆయూబ్ ఖాన్, మనోహర్ తదితరులు వివరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి మురళీమోహన్ కాలేజీ అభివృద్ధికి రూ. 20వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కాలేజీ నివేదికను ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్ సమర్పించారు. ఆర్జేడీ గిరి, అధ్యాపకులు టి. శ్రీనివాసులు, రాజశేఖర్, అనిల్‌కుమార్, సోమరాజు, ఆంజనేయరెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాక్ కమిటీ సభ్యులు

సీడ్‌సర్వే ద్వారా జీవనోపాధి కల్పించండి

పుంగనూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు సీడ్ సర్వే ద్వారా ఉపాధి కల్పించాలని మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డికి జోగి, దాసరి కుల నాయకులు కోరారు. సోమవారం ఈ కుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, నాయకులు మోహన్, ధన కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సీడ్‌సర్వేలో తమ కులాలకు ఉపాధి కల్పించాలని. అర్హులకు ఇళ్లు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కమిషనర్ స్పందిస్తూ పట్టణ పరిధిలోని సంచారజాతులపై సర్వే చేసి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ, కృష్ణప్ప, వెంకటరమణ, సుబ్రహ్మణ్యం, రవి పాల్గొన్నారు.


కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

అదానీ ముడుపుల వ్యవహారం నిగ్గు తేల్చాలి: సీపీఐ

పుంగనూరు రూరల్, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కొనుగోలు వ్యవహారంలో అదానీ నుంచి వైసీపీ నేతలకు భారీగా ముడుపులు అందాయనే ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి జనార్దన్ డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద పార్టీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ కుంభకోణాల వల్ల జగన్‌తో పాటు పలువురికి ముడుపులు ముట్టిన నేపథ్యంలో రాష్ట్ర ప్రజలపై భారీగా భారం పడబోతుందన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రభుత్వం నెలకు రూ.200 నుంచి రూ.500 వరకు పెంచిందన్నారు. అనంతరం తహసీల్దార్ రాముకు వీరు వినతి పత్రం అందజేశారు. మున్నా, మన్సూర్, సోము, కిషోర్ పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదరం ఉన్నారు. స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజినాయుడు, చిట్టిబాబు, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.


దీపావెంకట్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

కాశీవిశ్వేశ్వరుడికి విశేషపూజలు

కల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం దేవళంపేటలోని కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, హోమం నిర్వహించారు. ప్రత్యేక అలంకరణలో స్వామివారు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

●బైరెడ్డిపల్లె: నాగిరెడ్డిపల్లెలోని సోమేశ్వర స్వామి ఆలయంలో సోమవారం విశేషపూజలు నిర్వహించారు. అర్చకులు నాగేంద్ర స్వామివారికి అభిషేకంచేసి ప్రత్యేకపూజలు జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ప్రసవం రోజే బిడ్డకు జనన ధ్రువీకరణపత్రం


గర్భిణికి సూచనలిస్తున్న వైద్యాధికారి శ్రీనివాసులు

గంగవరం,డిసెంబరు09,(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగిన వెంటనే బిడ్డకు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు వెయ్యిరూపాయలు ఖాతాలో జమచేస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. పరీక్షలు, వైద్య పరీక్షలు చేశారు. ఈసందర్భంగా డాక్టర్ శ్రీనివాసులు పేర్కొన్నారు మాట్లాడుతూ...ప్రతి నెలా మందులు, పోషకాలు కలిగిన ఆహారం తీసుకొని అప్రమత్తంగా ఉంటే నార్మల్ డెలివరీలు పెరుగుతాయన్నారు.

నేడు ఎంసీపల్లెలో రెవెన్యూ సదస్సు

పుంగనూరు రూరల్, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): మిట్టచింతలవారిపల్లె సచివాలయం వద్ద మంగళవారం రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసీల్దార్ జే.రాము తెలిపారు. భూములు, రెవెన్యూ సమస్యలపై అర్జీలు ఇచ్చి పరిష్కరించుకోవచ్చునని వివరించారు.

సోనియా జన్మదిన వేడుకలు

పుంగనూరు, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను పుంగనూరు ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక ఇందిరాసర్కిల్‌లో ఆమె ఫ్లెక్సీ ఏర్పాటు చేసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేదలకు సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ ఎంతో కృషి చేసినట్లు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అయూబ్, రాయల్ అల్తాఫ్, ముబారక్, ఫయాజ్, షానావజ్ తదితరులు పాల్గొన్నారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి

గంగవరం,డిసెంబరు09,(ఆంధ్రజ్యోతి): వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వడ్డెర విజయభేరి అధ్యక్షుడు రామచంద్రయ్య వడ్డే కోరారు. విజయభేరిలో భాగంగా ఆయన సోమవారం పలమనేరు వచ్చారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... విద్యా, రాజకీయ, వ్యాపార రంగాల్లో వడ్డెరలు వెనుకబడి ఉన్నారన్నారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో వడ్డెరలు ఎస్టీ జాబితాలోఉన్నారన్నారు. 17 రాష్ట్రాల్లో వీరు ఎస్టీ జాబితాలో ఉన్నారన్నారు. మన రాష్ట్రంలో వడ్డెరలు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారన్నారు. ప్రభుత్వం వడ్డెరల స్థితిగతులను అధ్యయనం చేసి, ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరారు.

మామిడి బీమా సద్వినియోగం చేసుకోండి

వి.కోట, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌వో లక్ష్మీప్రసూన సూచించారు. రాష్ట్రంలో పునర్వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత పంటల బీమా పథకాన్ని ఈఏడాది మామిడికి వర్తింపజేశారన్నారు. ఎకరానికి ప్రీమియం రూ.1750 వంతున ఈనెల 15లోపు చెల్లించాలన్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

చిత్తూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఓ వ్యక్తి అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జవహర్ బాబు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ స్టేషన్ పరిధిలో విస్తతంగా తనిఖీలు చేశారు. చిత్తూరు - వేలూరు రోడ్డులోని చీలాపల్లె వద్ద వేలూరుకు చెందిన ఎస్.రాజి ద్విచక్రవాహనాన్ని ఆపారు. తనిఖీ చేయగా, వాహనంలో 110 లీటర్ల సారా గుర్తించారు. సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

పాలసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్తులకు సోమవారం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో దొంగతనాలు, సారా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్‌ఐ రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

పర్మినెంట్ చేయండి

మున్సిపల్ పారిశుధ్య విభాగ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల ధర్నా

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు నాగరాజన్ మాట్లాడుతూ.. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.31వేతనం ఇవ్వాలని కోరారు. మరణించిన కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సచివాలయ సెక్రటరీల వేధింపులను అరికట్టాలన్నారు. ప్రతి కార్మికుడికీ రెయిన్‌కోట్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ నేతలు దాసరి చంద్ర, రమాదేవి, గోపీనాథ్, మణి, విజయ్‌కుమార్, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ నేతలు దొరస్వామి, జయశంకర్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ఉపేక్షించేది లేదు

పందుల పెంపకందారులకు కమిషనర్ హెచ్చరిక

నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జనావాసాల్లో పందులు రాకూడదని ఇదివరకే పలుమార్లు హెచ్చరించాం. అయినా మార్పు రావడం లేదు. ఇక ఉపేక్షించేది లేదు' అంటూ పందుల పెంపకందారులను మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి హెచ్చరించారు. సోమవారం పందుల పెంపకందారులను మున్సిపల్ కార్యాలయానికి పిలిపించారు. మీ నిర్లక్ష్యం వల్ల జనావాసాల్లోకి పందులు వచ్చేస్తున్నాయని మండిపడ్డారు. మరోవైపు పట్టణవాసులు అనారోగ్యానికి గురవుతున్నారని, ఏడ్రోజుల్లోపు మార్పు రావాలని సూచించారు. పురుషోత్తం, శేఖర్, రవీంద్రారెడ్డి పాల్గొన్నారు.


పందుల పెంపకందారులతో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

మేత భూములను కాపాడండి

గుడిపాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో మేత భూములను కొందరు కబ్జా చేశారని, సర్వే చేయించి కాపాడాలని టీడీపీ సీనియర్ నాయకుడు చెన్నకేశవులు నాయుడు కోరారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డిని కలిసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. ● అలాగే తమ భూములను కొంతమంది కబ్జా చేశారని సోమవారం పలువురు బాధితులు తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. సర్వే చేయించి న్యాయం చేస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

నేడు రోడ్లను పరిశీలించనున్న కలెక్టర్

చిత్తూరు - వేలూరు జాతీయ రహదారిలోని పానాటూరు, ఎంసీఆర్ క్రాస్ వద్ద ఉన్న రోడ్లను మంగళవారం ఉదయం కలెక్టర్ సుమిత్‌కుమార్ పరిశీలిస్తారని ఎమ్మెల్యే జగన్మోహన్, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి హేమాద్రి నాయుడు తెలిపారు.

జడ్పీ అతిథి గృహాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే


జడ్పీ అతిథి గృహాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, సీఈవో

చిత్తూరు రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జడ్పీ అతిథి గృహంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని ఇటీవల ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనిపై చిత్తూరు ఎమ్మెల్యే స్పందించారు. సోమవారం సీఈవో రవికుమార్ నాయుడితో కలిసివెళ్లి పరిశీలించారు. నూతన భవన నిర్మాణానికి సాధ్యాసాధ్యాలపై చర్చించారు.

ప్రజలను చైతన్యవంతం చేయడమే లక్ష్యం



మీడియాతో మాట్లాడుతున్న మూర్తి

చిత్తూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను చైతన్యపరచడమే తమ లక్ష్యమని భారత సమ సమాజ అభివృద్ధి సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు టీకే మూర్తి అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వివిధ ప్రజా సంఘాలతో కలసి మీడియాతో మాట్లాడారు. విద్య, ఆరోగ్యం, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక అంశాలపై ప్రజలను చైతన్యపరిచే కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో లిండియా ఎస్సీ ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మునస్వామి, దళితప్రజావేదిక రాష్ట్ర అధ్యక్షుడు ధనంజయ రావు, అంబేడ్కర్ యువజన సమితి చిత్తూరు నియోజకవర్గ కన్వీనర్ బాబు, నేతలు రాజ్ కుమార్, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.






ఇవి క్రీడా మైదానాలేనా?

పిచ్చి మొక్కలు, చెత్తకుప్పలు, గడ్డితో నిండిపోయాయని క్రీడాకారుల ఆవేదన

ఎంతో మంది క్రీడాకారుల విజయానికి వేదికగా మారిన క్రీడా మైదానాలు.. నేడు పిచ్చి మొక్కలు, చెత్తకుప్పలకు నిలయంగా మారాయి. 1985-1995 మధ్య కాలంలో బీఎస్ కణ్ణన్ ప్రభుత్వ జూనియర్, ఉన్నత పాఠశాల క్రీడా మైదానాలు జిల్లాతోపాటు రాష్ట్ర, జాతీయస్థాయి క్రీడలకు వేదికలుగా నిలిచాయి. జిల్లా స్థాయి ఖోఖో, క్రికెట్, రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, హాకీ క్రీడలతోపాటు జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు జరిగాయి. మెసానికల్ (డీఎస్‌ఏ) క్రీడా మైదానానికి ముందు.. జిల్లా స్థాయిలో క్రీడలకు చెప్పుకోదగ్గవి ఏవైనా ఉన్నాయంటే ఈ పాఠశాల, జూనియర్ కళాశాల క్రీడా మైదానాలే. అలాంటి క్రీడా మైదానాలు నేడు చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు, గడ్డితో నిండిపోయాయి. రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు వేదికగా అడ్డాగా మారినా పట్టించుకునేవారు కరువయ్యారని పలువురు క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే.. ఈ క్రీడామైదానాలకు పూర్వ వైభవం రానుంది.

\- చిత్తూరు సెంట్రల్, ఆంధ్రజ్యోతి

కార్తీక వన మహోత్సవం

బంగారుపాళ్యం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చీకూరుపల్లె వద్ద ఉన్న సిద్దేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కార్తీక మాస వన మహోత్సవాన్ని నిర్వహించారు. ఉదయం ఆరు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమం జరిగింది. స్వామివారిని పూతలపట్టు, చిత్తూరు ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్మోహన్, చుడా చైర్‌పర్సన్ కటారి హేమలత, మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్ దర్శించుకున్నారు. అనంతరం భక్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు తెలిపారు. అలాగే మొగిలీశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలు చేశారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలనుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి దీపారాధన చేశారు. కాజూరు బాలాజి, ధరణీప్రసాద్ నాయుడు, జనార్దన్ గౌడ్, వినయ్ చౌదరి, కుప్పాల మురళి, మహేంద్ర, అనిల్ కుమార్, జనసేన నాయకుడు కిషోర్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు మురళీమోహన్, జగన్‌మోహన్‌కు పూర్ణకుంభ స్వాగతం - ఉసిరిచెట్టు వద్ద దీపం వెలిగించిన చుడా చైర్‌పర్సన్ హేమలత

సమస్యలను త్వరగా పరిష్కరించాలి: కమిషనర్


సమస్యను తెలుసుకుంటున్న నరసింహప్రసాద్

చిత్తూరు అర్బన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను త్వరగా పరిష్కరించాలని కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమానికి తొమ్మిది అర్జీలు అందాయి. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జంబాడలో అ'పూర్వ' కలయిక



విజయపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జంబాడలో 1986-87 సంవత్సరం పదో తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు శివనాథాచ్చారి, రామచంద్రరాజు, నారాయణరాజు, వడివేలు, సుబ్రహ్మణ్యంలను సన్మానించారు. అనంతరం పాఠశాలకు ఇన్వర్టర్‌ను, విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ చేశారు. హెచ్‌ఎం శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు


నిందితుడి వివరాలు తెలియజేస్తున్న పోలీసులు

శ్రీరంగరాజపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసుల్లో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. మంగుంటలో వారం కిందట పట్టపగలే భువనేశ్వరి ఇంట్లో 10గ్రాముల బంగారం, చంద్రబాబురెడ్డి ఇంట్లో రూ.20వేలను చోరీ చేశారు. బాధితుల ఫిర్యాదుతో కేసులు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గుడిపాల మండలం రామాపురం చెందిన ఎస్.రమేష్ కుమారుడు రాజేష్ (32)ను నిందితుడిగా గుర్తించారు. అతడిని జీడీనెల్లూరు మండలంలోని రాణా చెక్‌పోస్టు వద్ద సోమవారం అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.90వేలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కి తరలించినట్లు ఎస్‌ఐ సుమన్ తెలిపారు.



ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ

పాలసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వనదుర్గాపురంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుపై విచారణ మొదలైంది. వనదుర్గాపురం ఎస్టీ కాలనీకి చెందిన వెంకటేష్‌ను అదే గ్రామానికి చెందిన కల్లు విక్రయించే నాగరాజు.. కులం పేరుతో దూషించి, దాడి చేసినట్లు కేసు నమోదైంది. దీనిపై ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ జె.రామ్‌బాబు విచారణ చేపట్టారు.

పాత నేరస్తులకు కౌన్సెలింగ్

పాలసముద్రం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పాత నేరస్తులకు సోమవారం ఎస్‌ఐ చిన్నరెడ్డెప్ప కౌన్సెలింగ్ ఇచ్చారు. మండలంలో దొంగతనాలు, సారా వ్యాపారం చేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఏఎస్‌ఐ రవి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సారా కేసులో ఒకరి అరెస్టు

చిత్తూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సారా తరలిస్తున్న ఓ వ్యక్తి అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జవహర్ బాబు తెలిపిన వివరాల మేరకు.. సోమవారం చిత్తూరు ఎక్సైజ్ అర్బన్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేశారు. చిత్తూరు - వేలూరు రోడ్డులోని చీలాపల్లె వద్ద వేలూరుకు చెందిన ఎస్.రాజి ద్విచక్రవాహనాన్ని ఆపారు. తనిఖీ చేయగా, వాహనంలో 110 లీటర్ల సారా గుర్తించారు. సారా స్వాధీనం చేసుకుని, నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి సమాచారంతో రాసనపల్లెకు చెందిన ప్రభు, చిత్తూరు గాంధీ నగర్‌కు చెందిన విజయరాజ్‌లపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

'క్వారీ కాజేయాలని చూస్తున్నాడు'

చిత్తూరు సిటీ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ క్వారీని గ్రానైట్ వ్యాపారి కాజేయాలని చూస్తున్నాడని అరక్కోణంకు చెందిన భానుప్రతాప్ ఆరోపించారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. వారసత్వం ప్రకారం తనకు, తన వదినకు ఎస్ఆర్‌పురం మండలం దుర్గరాజపురంలోని క్వారీలో భాగం వచ్చిందన్నారు. ఈ క్వారీపై చిత్తూరుకు చెందిన గ్రానైట్ వ్యాపారి శేఖర్‌కు జీపీఏ ఇచ్చామన్నారు. ఇపుడు తమ సంతకాలను ఫోర్జరీ చేసి క్వారీని కాజేయాలని చూస్తున్నారని ఆరోపించారు. దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేశామన్నారు.

వదినకు వాటా ఇవ్వకుండా చేయడానికే..

వదినకు వాటా ఇవ్వకుండా చేయడానికే తనపై భానుప్రతాప్ ఆరోపణలు చేస్తున్నాడని గ్రానైట్ వ్యాపారి శేఖర్ తెలిపారు. సోమవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు ఈ విషయాన్ని తెలిపారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి విజయంపై హర్షం



స్వీట్లు తినిపించుకుంటున్న యూటీఎఫ్ నాయకులు

నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ ఉప ఎన్నికల్లో యూటీఎఫ్ అభ్యర్థి గోపీమూర్తి విజయం సాధించడంపై స్థానిక నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం పీసీఎన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో స్వీట్లు పంచుకుని, ఆనందాన్ని వ్యక్తం చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి ఎస్.మణిగండన్, రాష్ట్ర కౌన్సిలర్ పీఆర్ మునిరత్నం, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యుడు వంశీక్రిష్ణ, నేతలు జనార్దన్, హరిదాస్, ప్రకాష్, సంతోష్‌కుమార్, రమేష్, హరీష్ పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదు



వెదురుకుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని సురేంద్రనగరంలో టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం సోమవారం జరిగింది. మండల పార్టీ అధ్యక్షుడు ఎం.చెంగ్రాయ యాదవ్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఆరువేల సభ్యత్వాలు పూర్తి చేశామన్నారు.

రోగులకు అన్నదానం

గంగాధరనెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి):చిత్తూరుకు చెందిన ఎం.వి.కేశవరెడ్డి మెమోరియల్ ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీధర్ రెడ్డి సహకారంతో మండల ఇండియన్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో గంగాధరనెల్లూరు పీహెచ్‌సీలో సోమవారం రోగులకు అన్నదానం చేసినట్లు వైద్యులు దుర్గాదేవి, ప్రవీణ్ తెలిపారు. రెడ్‌క్రాస్ సొసైటీ మండల అధ్యక్షుడు పాపిరెడ్డి, సీహెచ్‌వో శ్రీనివాసులు, సూపర్‌వైజర్ ధర్మేంద్ర, హెల్త్ అసిస్టెంట్ కదిరవన్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు


దీపావెంకట్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో పెంచలకిషోర్

ఐరాల(కాణిపాకం), డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు సతీమణి ఉషమ్మ, కుమార్తె దీపావెంకట్, ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదరం ఉన్నారు. స్వామిని విడివిడిగా దర్శించుకున్నారు. వీరిని ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి, స్వామి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజినాయుడు, చిట్టిబాబు, సీఐ శ్రీధర్‌నాయుడు, ఎస్‌ఐ ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో అధ్యాపకుల ప్రతిభ



నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూనివర్సిటీలో ఈనెల 8వ తేదీన జరిగిన క్రీడా పోటీల్లో నగరి డిగ్రీ కళాశాలకు చెందిన అధ్యాపకులు ప్రతిభ చూపారు. టెన్నిస్ సింగిల్స్ విభాగంలో భాస్కర్‌రాజు రన్నర్‌గా నిలిచారు. త్రోబాల్, బాల్‌బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో అరుణకుమారి టీమ్ రన్నర్‌గా నిలిచారు. వీరిని ప్రిన్సిపాల్ వేణుగోపాల్ అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, భాస్కర్, వేణుగోపాల్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

పూతలపట్టు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలుపులపల్లె గ్రామంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. తహసీల్దార్ గురప్ప మాట్లాడుతూ.. సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. డీటీ మహేశ్వరి, సిబ్బంది పాల్గొన్నారు.

నేటినుంచి పాలసముద్రంలో..

పాలసముద్రం: మండలంలో మంగళవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు రెవెన్యూ సదస్సులు జరగనున్నాయని తహసీల్దార్ అరుణకుమారి తెలిపారు. ఈ అంశంపై సోమవారం తన కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమీక్షించారు. ఆర్‌ఐ దేవి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

పీహెచ్‌సీలో తనిఖీలు

తవణంపల్లె, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని పీహెచ్‌సీని జిల్లా అదనపు వైద్యాధికారి వెంకటప్రసాద్ సోమవారం తనిఖీ చేశారు. అక్కడున్న గర్భిణులతో మాట్లాడి, వైద్యసేవలను ఆరా తీశారు. రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

గంగాధరనెల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 18 ఏళ్లు పైబడిన మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మౌనిక తెలిపారు. తూగుండ్రం పీహెచ్‌సీలో పీఎం సురక్ష మాతృత్వ యోజనలో భాగంగా గర్భిణులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు.

ప్రజలకు అండగా నిలవండి: రోజా

నగరి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ శ్రేణులంతా ప్రజలకు అండగా నిలవాలని వైసీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి రోజా కోరారు. సోమవారం తన నివాసంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మున్సిపల్ చైర్మన్ నీలమేఘం, జడ్పీటీసీ గాంధీ, నాయకులు బాలకృష్ణన్, తిరుమల రెడ్డి, వేణుబాబు, తదితరులు పాల్గొన్నారు.

నేడు 'కార్వేటినగరం' సమావేశం

వెదురుకుప్పం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతుంది. ఈ సమాచారాన్ని ఎంపీటీసీలకు అధికారులు పంపించారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు

పాలసముద్రం, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 30 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రవీణ్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు అరుణ, లక్ష్మి, గంగా తదితరులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



విజయపురం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విజయపురానికి చెందిన వందవాసి మహేష్‌శర్మ సోమవారం విద్యాసామగ్రి వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు యోగేంద్రకుమారి, రిటైర్డు ఉపాధ్యాయులు చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం



చిత్తూరు కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సంస్థాన్‌లో సోమవారం స్వామివారి మాస నారాయణీ సేవ ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ప్రభుత్వాస్పత్రి, చర్చివీధి, గాంధీచౌక్, న్యూ కలెక్టరేట్ తదితర ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు. కస్తూరిబాయి బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు, వారి తల్లులకు విన్ హెల్త్‌కేర్ ఆస్పత్రి వైద్యుల సహకారంతో ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు.

కలెక్టర్, జేసీలను కలిసిన కాణిపాకం ఈవో

చిత్తూరు కలెక్టరేట్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధి వినాయకస్వామి ఆలయ నూతన ఈవో పెంచలకిషోర్ సోమవారం సాయంత్రం కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరిలను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి ప్రసాదాలను అందజేశారు. ఆ తర్వాత ట్రైనీ కలెక్టర్ హిమవంశీని కూడా కలిశారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి

చిత్తూరు కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు నాగరాజు తెలిపారు. సోమవారం మిట్టూరులోని సంఘ భవనంలో జరిగిన సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై సభ్యులు చర్చించారు. జి.వెంకటేష్, పీబీ పిళ్ళై, ఆనంద నాయుడు, శ్రీనివాసన్, టీఎన్ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.